RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 55 శుక్రవారం 21 మార్చి 2025 పేజీలు : 4

## 1000 మంది హిందూ భక్తులు మాయం

లక్నో: ప్రయాగ్‌రాజ్‌లో ఇటీవల ముగిసిన మహా కుంభ మేళాపై సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కుంభమేళాలో పాల్గొన్న సుమారు 1,000 మంది హిందూ భక్తుల జాడ ఇప్పటికీ తెలియలేదని, వారి ఆచూకీని కనిపెట్టడంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మహాకుంభ్‌ను పదేపదే తలుచుకోవడం మంచి విషయమేనని, అయితే మహాకుంభ్ నిర్వహణకు భారత ప్రభుత్వం ఎంత బడ్జెట్ ఇచ్చిందనేది ప్రధాన ప్రశ్న అని అన్నారు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రులు కేవలం వాహనాల పార్కింగ్ ఎరేంజ్‌మెంట్లు మాత్రమే చేశారని ఆయన చెప్పారు. కుంభమేళాలో సరైన ఏర్పాట్లు లేవని చెబుతూ పలువురు భక్తులను ముందుకు వెళ్లకుండా ఐపీఎస్ అధికారులు అడ్డుకున్నారని ఆరోపించారు. కుంభమేళాలో తప్పిపోయిన సుమారు 1000 మంది హిందూభక్తుల జాడ ఇప్పటికీ తెలియలేదన్నారు.




# ఎదురులేని శక్తిగా రేవంతుడు!

## పార్టీ - పాలనపై తనదైన శైలిలో పట్టు!!

## రేవంత్‌కు ఇక తిరుగులేదా? ఎదురే లేకుండా పోయిందా?

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయాల్లో తనకు తిరుగు లేకుండా చేసుకుంటున్నట్లే కనిపిస్తుంది. కనుచూపు మేరలో మరో నేత ఆయనకు పోటీకి వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఉన్న నలుగురైదుగురు సీనియర్ నేతలు సయితం రేవంత్ రెడ్డి ధాటికి తట్టుకోలేకపోతున్నట్లే కనిపిస్తుంది. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో చూసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయి.

అక్కడ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య పోటీ తీవ్రంగానే ఉంది. సిద్ధరామయ్యను తప్పించి డీకేను ముఖ్యమంత్రిని చేస్తారన్న ప్రచారం అక్కడ జరుగుతుంది. కానీ తెలంగాణలో అలాంటి ప్రచారానికి కూడా తావులేకుండా గ్రౌండ్ వర్క్ ను ముందుగానే రేవంత్ చేసుకున్నట్లు కనిపిస్తుంది.

**ఉత్తముడయినా...** రేవంత్ రెడ్డికి సరిసమానంగా పోటీ పడే నేత ఎవరూ కనిపించకుండా చేసుకున్నారు. సీనియర్ నేతలు మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంటి వారు ఉన్నా వారికి అధినాయకత్వం వద్ద ముఖ్యమంత్రి పదవిని చేపట్టేంత స్థాయిలేదన్న రీతిలో ఇప్పటికే కలరింగ్ వచ్చేసింది. ఉత్తమ్ కుమార్ రెడ్డి రెండుసార్లు పీసీసీ చీఫ్ గా పనిచేసినా పార్టీని అధికారంలోకి తేలేకపోయారు. అది ఆయనకు మైనస్.

ఉత్తమ్ కుమార్ రెడ్డికి అధినాయకత్వం వద్ద మంచి మార్కులున్నప్పటికీ నాయకత్వంపై అనేక అనుమానాలున్నాయి. ఆయన సమర్ధతపై సందేహాల వల్లనే ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి రేసులో లేరన్నది నిజమని చెప్పుకోవాలి. ఇటీవల తాను ముఖ్యమంత్రి పదవి రేసులో లేనని స్వయంగా చెప్పి అందరినీ ఆశ్చర్యపర్చారు.

**మల్లు కు పట్టున్నా...** ఇక మల్లుభట్టి విక్రమార్క కు మంచి మార్కులు ఉన్నప్పటికీ అందరినీ, కలుపుకుని పోయే నేత అయినప్పటికీ, పార్టీని విజయం వైపు నడిపించే శక్తి సామర్థ్యాలు లేవన్నది పార్టీ వర్గాలే అంగీకరిస్తున్న విషయం. ఆయన వ్యక్తిత్వం మంచిదే. అవినీతి ముద్ర లేదు. వివాదరహితుడు. అయితే ప్రజలను ఆకట్టుకునేంత ప్రసంగాలు చేయలేకపోవడం ఆయన బలహీనత. ఆయనకున్నంతలో మధిర నియోజకవర్గం నేతగానే ఎక్కువగా చెలామణి అవుతారు.

అంతే తప్ప రాష్ట్ర స్థాయి నేత కాలేరన్నది కాంగ్రెస్ పార్టీ నేతలే అంగీకరిస్తున్న విషయం. అందుకే ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మల్లు భట్టి విక్రమార్క పేరు కూడా రేవంత్ రెడ్డికి సరిసమాన స్థాయిలో లేకపోవడం రేవంత్ కు కలసి వచ్చినట్లుగానే కనిపిస్తుంది.

**కోమటిరెడ్డి ఉన్నప్పటికీ...** ఇక కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా తొలి నుంచి పార్టీని నమ్ముకున్న నేత. దశాబ్దాల నుంచి పార్టీలోనే కొనసాగుతుండటం ఆయనకున్న ప్రత్యేకత. ఎన్ని కష్టాలు ఎదురైనా ఆయన పార్టీ జెండాను వదిలిపెట్టలేదు. అయితే కోమటిరెడ్డి దూకుడు మనస్తత్వంతో పాటు ఆయన పదిమందిని ఆకట్టుకునే పరిస్థితి లేదన్నది వాస్తవం. కోమటిరెడ్డి వెంకటరెడ్డి సయితం స్వయంగా ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పదేళ్ల పాటు కొనసాగుతారని చెప్పి సెల్ఫ్ గోల్ వేసుకున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అందుకే ప్రచారం జరుగుతున్నట్లు రేవంత్ రెడ్డి పదవికి ముప్పు ఇప్పట్లో వచ్చే అవకాశం లేదు. క్రౌడ్ పుల్లర్ గా కూడా ఆయనకు పేరుండటం, ఆర్థికంగా, సామాజికంగా బలమైన నేత కావడం అదనపు బలం అని చెప్పక తప్పదు.




### రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేస్తా.. ఇప్పటికే కసరత్తు..: కేటీఆర్ ప్రకటన

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇవాళ సూర్యాపేట జిల్లాలో పర్యటిస్తున్నారు. ఆయనకు భారీ బైక్ ర్యాలీతో బీఆర్ఎస్ కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం ముఖ్య కార్యకర్తలు సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. వచ్చే ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని తెలిపారు. పాదయాత్ర పై కసరత్తు జరుగుతోందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా తన పాదయాత్ర ఉంటుందని చెప్పారు. సూర్యాపేటలో పబ్లిక్ ను చూస్తే పెద్ద బహిరంగ సభకు వచ్చినట్లుగా ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత స్టార్ట్ అయిందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే అధికారమని చెప్పారు. దేశంలో తెలుగు వాళ్లు కూడా ఉన్నారని ఎన్టీఆర్ చాటారని, తెలంగాణ కూడా ఉందని కేసీఆర్ దేశానికి చాటారని అన్నారు. తెలుగు గడ్డపై పుట్టి దేశ రాజకీయాల్లో ప్రభావం చూపిన పార్టీలు టీడీపీ, బీఆర్ఎస్ అని తెలిపారు. కేసీఆర్ మోకాళ్ల ఎత్తు కూడా లేని కొందరు అసెంబ్లీలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని చెప్పారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపి వేస్తామని ఎన్ని చెప్పినా చరిత్ర మారదని, కేసిఆర్ లేకపోతే తెలంగాణ రాష్ట్రమే లేదని చెప్పుకొచ్చారు. తొలి 14 ఏళ్లు ఉద్యమ పార్టీగా రాష్ట్రాన్ని సాధించామని అన్నారు. పదేళ్లు రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించామని చెప్పారు. "ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వానికి చెమటలు పట్టిస్తున్నాం. ప్రజల తరఫున బీఆర్ఎస్ ప్రభుత్వంతో కొట్లాడుతుంది. పార్టీ పని అయిపోయింది.. ఇక మూత పడతది అన్నారు. కాంగ్రెస్, బీజేపీకి ఎదుర్కొని నిలబడి పోరాడుతున్నాం. చిన్న వయసులో రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు. పర్సనాలిటీ పెంచుకుంటారనుకుంటే పర్సెంటేజీలు పెంచుకుంటున్నారు. కాంగ్రెస్ విష ప్రచారాలను నమ్మి ప్రజలు బీఆర్ఎస్ ను ఓడగొట్టారు" అని చెప్పారు.




## కాంగ్రెస్‌లో సడెన్ మార్పులు..!

### మంత్రులంతా ఏకతాటిపైకి వచ్చారా? మార్పు వెనుక మీనాక్షి మంత్రాంగం ఉందా?

హైదరాబాద్ : గతమంతా గందరగోళం. ఎవరి దారి వాళ్లదే. అపోజిషన్ సీఎంను విమర్శించినా..ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టినా మంత్రులు రియాక్షన్ అంతంత మాత్రంగానే ఉండేది. కానీ ఇప్పుడు సీన్ మారిందన్న టాక్ వినిపిస్తోంది. బడ్జెట్ సెషన్‌లో అమాత్యుల మాట్లాడుతున్న తీరు హస్తం నేతల్లో జోష్ నింపుతోందట. ప్రతిపక్షాలను ఎదుర్కొనేందుకు అమాత్యులంతా ఏకతాటిపైకి వచ్చారా.? ఎవరికి వారే యమునా తీరేలా ఉన్న మంత్రులు కలిసికట్టుగా పని చేస్తున్నారా.? మంత్రుల్లో మార్పు వెనుక మీనాక్షి మంత్రాంగం ఉందా.? తెలంగాణ కాంగ్రెస్ అంటేనే తలోదారి అనే చర్చ ఉంటుంది. కానీ హస్తం పార్టీలో సడెస్ ఛేంజెస్ కనిపిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు ఎవరికి వారే అన్నట్లు వ్యవహరించిన మంత్రులు..రూట్ మార్చినట్లు టాక్ వినిపిస్తోంది. మంత్రివర్గంలో విభేదాలున్నాయని, సీఎం రేవంత్ రెడ్డికి కొందరు మంత్రులకు పడటం లేదన్న చర్చ ఉండేది. క్యాబినెట్‌లో కొంతమంది మంత్రులు తనకు సహకరించడం లేదని పార్టీ అంతర్గత సమావేశాల్లో స్వయంగా రేవంత్ రెడ్డి వాపోయిన సందర్భాలున్నాయి. ఇలా మంత్రివర్గంలో గ్యాప్..అసెంబ్లీలోనూ కొట్టొచ్చినట్లు కనిపించేంది. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు, ఆరోపణలతో దాడికి దిగినా..మంత్రులు పెద్దగా పట్టనట్లు ఉంటూ వచ్చారు. తమ తమ శాఖలకు సంబంధించిన అంశం వస్తే తప్ప మిగతా సందర్భాల్లో పెద్దగా రెస్పాండ్ అయ్యే వారు కాదు. ప్రతీ దానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పుకోవాల్సి వచ్చేది.

**సభ్యులంతా ఏకతాటిపైకి వచ్చి స్పీడ్‌గా నిర్ణయాలు..** ఇప్పుడు బడ్జెట్ సమావేశాలను గమనిస్తే పరిస్థితిలో మార్పు వచ్చినట్లు చర్చ జరుగుతోంది. ఈ అసెంబ్లీ సమావేశాల్లో అధికార కాంగ్రెస్ లో చాలా ఛేంజెస్ వచ్చాయన్న టాక్ వినిపిస్తోంది. స్పీకర్ ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ సభ్యుడు జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యల విషయంలో ఇది స్పష్టంగా కనిపించింది. సభలో ఉన్న మంత్రులు, ఇతర సభ్యులంతా ఏకతాటిపైకి వచ్చి స్పీడ్‌గా నిర్ణయాలు తీసుకున్నారు.

# పేచేముడ్!

## బీఆర్ఎస్ పేరును టీఆర్ఎస్‌గా మార్చబోతున్నారా ?

## ముహూర్తం ఫిక్సయ్యిందా ?




హైదరాబాద్ : కేసీఆర్ కీలక ప్రకటన చేయబోతున్నారా ? భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ పేరును తెలంగాణా రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)గా మార్చబోతున్నారా ? బీఆర్ఎస్ కంటే టీఆర్ఎస్ పేరే బెటర్ అనే నిర్ణయానికి గులాబీ బాస్ వచ్చారా ? అనే అంశాలపై ఇప్పుడు బీఆర్ఎస్ వర్గాల్లో లోలోపల హాట్ డిస్కషన్ నడుస్తోంది.

త న పార్టీకి 'టీఆర్ఎస్' పేరు అయితేనే బెటర్ అని.. ఈమేరకు మార్పులు చేస్తే బాగుంటుందని ఒకానొక దశలో కేసీఆర్ అభిప్రాయపడ్డారనే ప్రచారం జరుగుతోంది.కేసీఆర్ ఏది చేసినా.. ఒక మంచి ముహూర్తం కావాల్సిందే. బీఆర్ఎస్ పేరును టీఆర్ఎస్‌గా మార్చేందుకు కూడా ఒక ముహూర్తాన్ని ఆయన ఫిక్స్ చేశారనే టాక్ వినిపిస్తోంది. వచ్చే నెల (ఏప్రిల్) 27న వరంగల్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ పాతికేళ్ల ఉత్సవాలు జరుగుతున్నాయి.

ఆ సభ వేదికగా కేసీఆర్ ప్రకటించే కీలక నిర్ణయాలలో.. పార్టీ పేరు మార్పు అంశం కూడా ఉందని అంటున్నారు.

**టీఆర్ఎస్ పేరుతో ఎన్నో విజయాలు..** టీఆర్ఎస్ పార్టీ పేరుతో కేసీఆర్ ఎన్నో విజయాలను అందుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ పార్టీ పేరు ఇంటింటికి చేరింది. తెలంగాణా రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరుతో తెలంగాణ ఉద్యమ పార్టీని 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ ఏర్పాటు చేశారు. 2001 నుంచి 2014 వరకు ఏకంగా 13 ఏళ్లకుపైనే ఎన్నో విజయాలను టీఆర్ఎస్ అందుకుంది. టీఆర్ఎస్ అంటేనే తెలంగాణా అనేలా జనం మనసుల్లో ఆ పేరు నిలిచిపోయింది. టీఆర్ఎస్ పార్టీ పేరుతోనే 2014, 2018 ఎన్నికల్లో వరుసగా రెండు సార్లు గెలిచి తెలంగాణాలో కేసీఆర్ అధికారంలో వచ్చారు. 2018లో గెలిచాక కేసీఆర్ ఫోకస్ జాతీయ రాజకీయాలపై పడింది. కొంత మంది సన్నిహితుల సలహాలు ఆయన ఆలోచనను మార్చాయి.టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చేలా చేశాయి. 2022 డిసెంబర్ 9న టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చారు. పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చాక.. తెలంగాణ కంటే పొరుగు రాష్ట్రాలపై కేసీఆర్ ఎక్కువ ఫోకస్ పెట్టడం మొదలుపెట్టారు. దీనివల్ల రాష్ట్రంలో పార్టీ దెబ్బతింది. అప్పట్లో ప్రశాంత్ కిశోర్ లాంటి రాజకీయ వ్యూహకర్తలు ఇచ్చిన తప్పుడు సలహాలు పనిచేయలేదు. బీఆర్ఎస్ అంతగా రాణించలేకపోయింది. జాతీయ రాజకీయాల విషయంలో భవిష్యత్ ప్రణాళికలను అమలు చేయలేకపోయింది.

2023 డిసెంబరులో జరిగిన తెలంగాణా శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఘోర పరాజయం ఎదురైంది. 2024 మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు జీరో నంబర్ వచ్చింది.

## సంపాదకీయం

# తెలుగు బడ్జెట్లు జిగేల్... పేద అరుపులు కామన్!

రెండు తెలుగు రాష్ట్రాల బడ్జెట్లు చూస్తే జిగేల్ మంటాయి. భారీ అంకెలతో కనిపిస్తాయి. ఏ ఏటికి ఆ ఏడు వేల కోట్లు పెంచుకుంటూ పోతున్నాయి. అయితే ఇంత పెద్ద బడ్జెట్లు చూసిన తరువాత ఎవరైనా అనుకునేది ఒక్కటే మాట. రెండు తెలుగు రాష్ట్రాలు అయిన ఏపీ తెలంగాణా అత్యంత సంపన్న రాష్ట్రాలు అని. కానీ అదే టైం లో ఖజానా ఖాళీ అని రెవిన్యూ లోటు ఉందని వచ్చిన ఆదాయం చూస్తే ఎక్కడా సరిపోవడం లేదని ప్రభుత్వ పెద్దలు చెబుతారు. తాజాగా తెలంగాణా ఆర్థిక పరిస్థితి మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను పట్టుకుని నేషనల్ మీడియా హైలెట్ చేసింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఆ రాష్ట్రం ఉంది అన్నట్లుగా కథనాలు వచ్చాయని ప్రచారంలో ఉంది. ఇపుడు చూస్తే బడ్జెట్ ఘనంగానే పెట్టారు. బుధవారం తెలంగాణా అసెంబ్లీలో ఆర్థిక మంత్రి హెూదాలో మల్లు భట్టి విక్రమార్క ఏకంగా మూడు లక్షల నాలుగు వేల కోట్ల పై చిలుకు భారీ బడ్జెట్ ని ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ లో వివిధ రంగాలకు కేటాయింపులు కూడా భారీగానే ఉన్నాయి. ఈ బడ్జెట్ లో అనేక ప్రాధాన్యతలను కూడా ముందుకు తెచ్చారు. విద్య వైద్యం సాగు నీటి పారుదల రంగం వ్యవసాయానికి బడ్జెట్ లో అధిక మొత్తంలో నిధులను కేటాయించారు. ఇది అందరి బడ్జెట్ గా కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. ఇక దీనికి కొద్ది రోజుల ముందు ఏపీ ప్రభుత్వం కూడా భారీ బడ్జెట్ ని ప్రవేశపెట్టింది. 3,22,359 కోట్ల రూపాయలతో ఈ బడ్జెట్ ని రూపొందించారు. ఈ బడ్జెట్ లో లక్ష కోట్ల లోటు ని కూడా చూపించారు. దీని మీదనే విపక్షాలు ఎలా బ్యాలెన్స్ చేస్తారని విమర్శలు చేశాయి. ఇక చూస్తే ఏపీ ప్రభుత్వం ప్రతీ మంగళ వారం రిజర్వ్ బ్యాంక్ వద్ద అప్పులను తెస్తోందని కూడా విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం చెప్పిన దాని ప్రకారం చూస్తే పది లక్షల కోట్లకు పైగా అప్పులు ఉన్నాయని అర్ధం అవుతోంది. ఇక తెలంగాణా ప్రభుత్వం చెప్పిన దాని ప్రకారం చూస్తే అక్కడ కూడా ఏడు నుంచి ఎనిమిది లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి. బడ్జెట్ లో ఆశించిన ఆదాయాలు రాకపోయినా లేక వేసుకున్న అంచనాలు తగ్గినా అప్పులు చేయాల్సిందే అని అంటున్నారు. అయితే రెండు తెలుగు రాష్ట్రాలు ఎక్కడా తగ్గడంలేదు. భారీగానే అంకెలతో బడ్జెట్ ని రూపొందిస్తున్నాయి. దీని వల్ల ఏమిటి మేలు అని విపక్షాలు అంటున్నాయి. వాస్తవికతకు అద్దం పట్టేలా బడ్జెట్ ని రూపొందించాలని కోరుతున్నాయి. ఎంత ఆదాయం వస్తుంది, ఎంత ఖర్చు అవుతుంది. అప్పులు ఎన్ని ఉన్నాయి. నికరంగా కేంద్రం ఇచ్చే సాయం ఏమిటి ఆర్థిక వనరులు ఏమిటి అన్నీ చూసుకుని బడ్జెట్ ని జనాల ముందు పెడితే ఏ విధమైన అపోహలూ ఉండవు కదా అని విపక్షాలు అంటున్నాయి. ఇక చూస్తే ఇంత పెద్ద బడ్జెట్ లను ప్రవేశపెట్టిన తరువాత కేంద్రం వద్దకు వెళ్ళి సాయం చేయమంటే చేస్తాయా అన్న చర్చ కూడా ఉంది. మరో వైపు బీద అరుపులు అన్నది కూడా కామన్ అయిపోయింది అని అంటున్నారు. ఏపీలో చూస్తే ఆర్థిక విధ్వంశం అని కూటమి పెద్దలు గత పది నెలలుగా చెబుతూ వస్తున్నారు. కానీ బడ్జెట్ భారీ తనంలో ఎక్కడా దాని ప్రభావం కనిపించడం లేదని అంటున్నారు. కేసీఆర్ సంపన్న తెలంగాణాను అప్పుల కుప్ప చేశారని కాంగ్రెస్ విమర్శలు చేస్తోంది. కానీ బడ్జెట్ చూస్తే చాలా బరువుగానే ఉంది అని అంటున్నారు. మొత్తానికి బడ్జెట్ లో పేర్కొన్న వాటికి తగినట్లుగా కేటాయింపులు చేసిన వాటికి తగిన విధంగానూ ఖర్చు చేసి అమలు చేస్తేనే రాణింపు అని అంటున్నారు.

# అంతర్రాష్ట్ర నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టు రట్టు చేసిన శామీర్పేట, ఎస్ ఓ టి పోలీసులు...

**3750 కిలోల నకిలీ పత్తి విత్తనాల పట్టివేత....**

**నాలుగు వేల ఎకరాల మేర నకిలీ విత్తనాల పత్తి సాగును అరికట్టి, ఆ మేరకు రైతులను సమాజాన్ని రక్షించిన పోలీసులు...**

**సంయుక్తంగా వివరాలు వెల్లడించిన మేడ్చల్ ఎస్ఓటి డిసిపి శ్రీనివాస్, మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి....**



శామీర్ పేట, (గరుడ వార్త) : నకిలీ విత్తనాలు మదకద్రవ్యాలు తరలిస్తున్న, విక్రయిస్తున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి హెచ్చరించారు. 3750 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకొని, నాలుగు వేల ఎకరాల మేర నకిలీ విత్తనాల పత్తి సాగును అరికట్టి, ఆ మేరకు రైతులను సమాజాన్ని రక్షించగలిగామని మేడ్చల్ ఎస్ ఓ టి డి సి పి శ్రీనివాస్ తెలిపారు. నమ్మదగ్గ సమాచారం మేరకు నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్న ముఠాను ఎస్ఓటి, శామీర్ పేట పోలీసులు, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకున్నారు. మేడ్చల్ ఎస్ఓటి డిసిపి శ్రీనివాస్ తో కలిసి మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం కర్ణాటక నుంచి మంచిర్యాలకు నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని శామీర్ పేట ఓఆర్ఆర్ వద్ద తనిఖీ చేశారు. అధిక కిరాయికి ఆశపడి నరేష్ అనే వ్యక్తిఅతని డీసీఎం ఐచర్ వాహన నెంబర్ టి ఎస్ 19-టి -3447 వాహనాన్ని తీసుకొని కర్ణాటకలోని పుస్తగి వెళ్లి అక్కడ రమణ అలియాస్ రామయ్య వద్ద 150 బస్తాల నిషేధిత పత్తి విత్తనాలు తన వాహనంలో లోడ్ చేసుకొని మంచిర్యాలకు తరలిస్తున్నారు అన్న విశ్వసనీయ సమాచారం తోమార్గమధ్యంలోని శామీర్ పేట ఓఆర్ఆర్ వద్ద శామీర్పేట పోలీసులు మరియు ఎస్ ఓ టి పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో నరేష్ కు చెందిన డీసీఎం వాహనంలో 3750 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు చేసుకున్నారు. వాటిని పరిశీలించగా నకిలీ విత్తనాలుగా తేలడంతో నరేష్ ను అదుపులోకి తీసుకున్నారు. మంచిర్యాల పరిధిలోని లక్షెట్టిపేటకు చెందిన సొల్లు సురేష్ అనే వ్యక్తి పరారి లో ఉన్నట్లు డిసిపి కోటిరెడ్డి తెలిపారు. త్వరలోనే సురేష్ ని పట్టుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా




డీసీపీ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాలు తరలించిన, విక్రహించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో సైతం నకిలీ విత్తనాలు తరలిస్తున్న ముఠాను, గంజాయి తరలిస్తున్న ముఠాలను తమ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. నకిలీ విత్తనాలను పట్టుకున్న పోలీసులను అభినందించారు. త్వరలోనే వారికి రివార్డు సైతం అందజేయనున్నట్లు చెప్పారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఈ విత్తనాలు దాదాపు 4000 ఎకరాల్లో నాటడానికి తీసుకెళ్తున్నారని, విత్తనాలు గనక నాటితే 4000 ఎకరాల భూమి సారవంతం దెబ్బతిని విషపూరితంగా మారేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటి అడిషనల్ డిసిపి శివ ప్రసాద్, పేట్ బషీరాబాద్ ఏసిపి రాములు, శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్ ఓ టి ఇన్స్పెక్టర్ శ్యామ్ సుందర్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రహదారుల విస్తరణ.. మెరుగవనున్న రవాణా



గోదావరిఖని: ఉమ్మడి జిల్లాలో రవాణా వ్యవస్థ మెరుగుకు అడుగులు పడుతున్నాయి.. నలువైపులా జాతీయ రహదారుల విస్తరణ పనులు సాగుతున్నాయి.. మరోవైపు నాలుగు కొత్తవాటికి ప్రతిపాదనలు వెళ్లాయి.

**మంచిర్యాల-వరంగల్ (ఎన్‌హెచ్ 163)**

ఈ హరిత జాతీయ రహదారి పెద్దపల్లి జిల్లాలోని మంథని, రామగిరి, ముత్తారం మండలాల మీదుగా సాగుతుంది. మూడు ప్యాకేజీల కింద చేపట్టే పనులను మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్వ గ్రామం నుంచి మొదలు పెట్టి జిల్లాలోని మంథని మండలం పుట్టపాక, రామగిరి, ముత్తారం మండలాల్లోని 16 గ్రామాల మీదుగా 39.96 కిలోమీటర్ల మేర సాగుతుంది. ప్రస్తుతం భూసేకరణ పనులు సాగుతున్నాయి. రహదారి నిర్మాణం కోసం ప్రాథమిక పనులు జరుగుతున్నాయి. భూసేకరణ కోసం రూ.94 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ.71 కోట్ల పరిహారం చెల్లించారు.

**ఎల్కతుర్తి- సిద్దిపేట (ఎన్ 765డిజి)**

ఈ జాతీయ రహదారి ఉమ్మడి జిల్లాలో 133 కిలోమీటర్లు విస్తరించనుంది. భూసేకరణ పూర్తయింది. రెండు ప్యాకేజీల్లో చేపడుతున్న పనులు ఉమ్మడి జిల్లాలోని ఎల్కతుర్తి, ములుకనూరు, భీమదేవరపల్లి, కొత్తపల్లి, మంగళపల్లి, రాంనగర్‌ల మీదుగా నాలుగు వరుసల రహదారి నిర్మాణం పనులు సాగుతున్నాయి. ఈ రహదారికి కేంద్ర ప్రభుత్వం రూ.1,458 కోట్లు కేటాయించింది. రహదారి విస్తరణలో 25 కల్వర్టులు నిర్మించనున్నారు.

జగిత్యాల-కరీంనగర్-వరంగల్ (ఎన్‌హెచ్ 563)

ఈ జాతీయ రహదారి ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, కరీంనగర్ మీదుగా వరంగల్ చేరుకుంటుంది. దీన్ని రెండు ప్యాకేజీలుగా విభజించారు. కరీంనగర్ నుంచి వరంగల్, జగిత్యాల నుంచి కరీంనగర్ వరకు రెండు విభాగాలుగా పనులు చేపడుతున్నారు.

కరీంనగర్ నుంచి వరంగల్ వరకు రహదారి విస్తరణకు కేంద్రం రూ.2,146 కోట్లు కేటాయించింది. ఇప్పటికే 325 హెక్టార్ల భూమిని సేకరించారు. కరీంనగర్ నుంచి మానకొండూర్, శంకరపట్నం, హుజూరాబాద్, ఎల్కతుర్తి మీదుగా 68 కిలోమీటర్లు నాలుగు వరుసల రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. జగిత్యాల నుంచి కరీంనగర్ వరకు రహదారి నిర్మాణానికి రూ.2,223 కోట్లు కేటాయించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. రహదారి నిర్మాణానికి టెండర్ ప్రక్రియ చేపట్టారు.ఆర్మూర్- జగ్దల్‌పూర్ (ఎన్‌హెచ్ 63) ఈ రహదారి ఉమ్మడి జిల్లాలో 69 కిలోమీటర్లు సాగుతుంది. మెట్‌పల్లి, కోరుట్ల, మేడిపల్లి, జగిత్యాల, బుగ్గారం, ధర్మపురి, వెల్గటూరు మండలాల్లోని 28 గ్రామాల మీదుగా మంచిర్యాల జిల్లాకు చేరుకుంటుంది. మెట్‌పల్లి నుంచి రాయపట్నం వరకు 224 హెక్టార్ల భూసేకరణ చేపట్టారు. రహదారి నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తయింది. పరిహారం విషయంలో కొన్ని చోట్ల భూసేకరణ సమస్యలు తలెత్తాయి. అవి పూర్తి కాగానే పనులు చేపట్టనున్నారు.

**విస్తరణకు ప్రతిపాదనలు ఇవి..** సిద్దిపేట నుంచి సిరిసిల్ల, వేములవాడ, కోరుట్ల వరకు 65 కిలోమీటర్లు. జగిత్యాల - పెద్దపల్లి- మంథని- కాటారం 130 కిలోమీటర్లు. కరీంనగర్- వేములవాడ- సిరిసిల్ల మీదుగా కామారెడ్డి 165 కిలోమీటర్లు.కరీంనగర్ నుంచి రాయపట్నం వరకు 60 కిలోమీటర్లు.

# ప్రభుత్వ భూముల్లోకి చొరబాట్లు

కరీంనగర్ : జగిత్యాల సమీపంలోని ప్రధాన రహదారికి ఆనుకొని కూతవేటు దూరంలో ఉన్న సర్వే నంబరు 437లోని ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా కొందరు చొరబడ్డారు. అసలు పట్టాదారుల వలే అందినకాడికి భూమిని వారి పేరిట రాయించుకున్నారు. ఇదే స్థలంలోని ఆక్రమణల తీరుని బట్టబయలు చేయాలని పలు ఆధారాలతో సహా జిల్లా కలెక్టరుకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. మొత్తం విస్తీర్ణం దాదాపు 378 ఎకరాలు కాగా 77 ఎకరాల వరకు పలువురు పేదలకు అసైన్డ్ చేశారు. ఇది పోనూ మిగులు భూమిలో దర్జాగా అక్రమార్కులకు పట్టాలు పుట్టుకొచ్చాయి. ఏకంగా కొందరు ప్రజాప్రతినిధుల సంబంధీకులు ఈ భూముల్లో కొంత విస్తీర్ణాన్ని తమ పేరిట మార్చుకున్నారు. ఈ విషయాన్ని ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన రెవెన్యూ అధికారులు కూడా ధ్రువీకరించారు. నోటీసులు అందించి ఆక్రమిత స్థలాన్ని తిరిగి స్వాధీనపర్చుకునే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

**అనధికారికంగా ఎక్కువే..!** అధికారుల లెక్కల ప్రకారం 957 ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఆక్రమణల్లో ఉంది. వాస్తవానికి క్షేత్రస్థాయిలో ఇందుకు రెండు, మూడింతల భూమి ఇతరుల చెరల్లోకి చేరిపోయింది. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో చాలా చోట్ల రెవెన్యూ సిబ్బంది ఆక్రమిత స్థలాల విషయంలో నిర్లక్ష్యాన్ని చూపించారనే విమర్శలున్నాయి. దీంతో ప్రభుత్వ భూమి సర్వేనంబరులో బైనంబర్లతో కొత్త పట్టాలు పలుచోట్ల పుట్టుకొచ్చాయి. రికార్డుల్లో పట్టాభూమి విస్తీర్ణానికి అదనంగా పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని కలుపుకొని రికార్డులను తారుమారు చేసిన ఉదంతాలున్నాయి. దీంతో వేలాది ఎకరాల విషయంలో సరైన పర్యవేక్షణ లేదు. కనీసం ఎక్కడ ఏ ప్రభుత్వ స్థలం ఉందనే విషయమై కూడా హద్దులు, సూచికల్ని చాలాచోట్ల ఏర్పాటు చేయలేదు.

**స్పందించి.. రక్షిస్తేనే..!** ప్రజావాణితోపాటు జిల్లాపాలనాధికారికి వివిధ సందర్భంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్న తీరుపై ఆయా గ్రామాల నుంచి పలు విన్నపాలు అందుతున్నాయి. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి స్థలాన్ని సంరక్షించే చర్యలు తీసుకుంటే బాగుంటుంది. కానీ సకాలంలో స్పందించకపోవడంతో భూమి విషయంలో వివాదం ఇంతకింతకు పెరుగుతోంది. కొన్ని కబ్జాల విషయంలో గతంలో పనిచేసిన రెవెన్యూ సిబ్బంది సహకారాలు సంపూర్ణంగా అందినట్లు ఉన్నతాధికారులు గతంలో చేపట్టిన విచారణల్లోనూ బయటపడ్డాయి. ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకుంటూ ఉన్న భూమిని కాపాడుకునే దిశగా యంత్రాంగం చొరవచూపించాల్సిన అవసరముంది. హద్దులు గుర్తించే వీలుగా ఇది ప్రభుత్వ భూమి అనే హెచ్చరిక సూచికలను ఏర్పాటుచేయాలి.

# భద్రాచలం ఆలయ అన్నదాన సత్రం ఎదుట స్థలం స్వాధీనం

భద్రాచలం : భద్రాచలం రామాలయానికి సమీపంలో అన్నదాన సత్రం ముందు వైపు ఉన్న స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. విస్తా కాంప్లెక్స్‌కు ఆనుకుని శిల్పినగర్ కాలనీకి సమీపంలోని ఈ ప్రదేశంలో రెవెన్యూ అధికారులు బోర్డులను ఏర్పాటు చేశారు. 124/3/పి సర్వే నంబరులో 6.98 ఎకరాల స్థలం ప్రభుత్వానిదిగా పేర్కొన్నారు. రూ.కోట్ల విలువైన ఈ స్థలం ప్రభుత్వానికి చెందిందేనని హైదరాబాద్‌లోని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) తీర్పునిచ్చిందని ఆర్డీఓ దామోదర్‌రావు తెలిపారు.



సుదీర్ఘ న్యాయపోరాటం.. 6.98 ఎకరాల విస్తీర్ణంలో ఖాళీ స్థలంతోపాటు పలు దుకాణాలు, అద్దె గదులు ఉన్నాయి. ఇందులో అన్నపూర్ణ రామలింగేశ్వర స్వామి ఆలయం, శ్రీగురు గోవింద స్వామి మఠం ఉంది. కాపా రామలక్ష్మమ్మ సేవా సమితి తరఫున వీటిని కొందరు నిర్వహిస్తున్నారు. సుదీర్ఘ కాలం నుంచి ఈ స్థలంపై ఇరు వర్గాలు న్యాయ పోరాటం సాగిస్తుండగా సీసీఎల్ఏ తీర్పును రెవెన్యూ అధికారులు స్వాగతిస్తున్నారు. దీనిపై కాపా రామలక్ష్మమ్మ సేవా సమితి నిర్వాహకులు మాట్లాడుతూ సీసీఎల్ఏ తీర్పును తాము సవాల్ చేయగా యథాతథ స్థితి కొనసాగించేందుకు సోమవారం స్టేటస్ కో వచ్చిందని పేర్కొంటున్నారు.

# పట్టు తప్పింది

ఉట్నూరు : నీటి వనరులు తక్కువగా ఉన్న ఆదివాసీ గిరిజన రైతులకు ఏడాది పొడవునా జీవనోపాధి కల్పించాలనే సదాశయంతో ఉట్నూరులో పట్టు పరిశ్రమను గతంలో ఏర్పాటు చేశారు. పట్టు పురుగులు పెంపకం, గూళ్ల ఉత్పత్తి, మల్బరీ, దసలి సాగు, పట్టుదారం తీయడం, టస్సర్ వస్త్రాలు నేయడం వంటి యూనిట్లను నెలకొల్పారు. ఆదాయంతోపాటు గిరిజనులకు ఆర్థికంగా ఊతమివ్వాలన్న సర్కారు ఆశయం బాగానే ఉన్నా నిధులు, నియామకాల సమస్యతో పరిశ్రమ కొట్టుమిట్టాడుతోంది. ఇప్పటికే అన్ని యూనిట్లలో ఉత్పత్తి నిలిచిపోయి పరిశ్రమ మూతపడే దిశలో ఉంది. ఉట్నూరులో 1983 సంవత్సరంలో అప్పటి సర్కారు పట్టు పరిశ్రమను ఏర్పాటు చేసింది. పట్టు పురుగుల పెంపకం, గూళ్ల ఉత్పత్తి, మల్బరీ, దసలి సాగు, పట్టుదారం తీయడం, టస్సర్ వస్త్రాలను నేయడం వంటి యూనిట్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. పట్టు పరిశ్రమశాఖ సహాయ సంచాలకులు(ఏడీ), పట్టు పరిశ్రమ అధికారి(ఏవో), సహాయ అధికారులు, సిబ్బంది, పరిశ్రమలో పని చేయడానికి కార్మికులను నియమించారు.

**ఒక్కొక్కరుగా బదిలీ..**

తొలుత పట్టు పరిశ్రమ సహాయ సంచాలకులు(ఏడీ) అధికారి పోస్టును తొలగించింది. ఆ తర్వాత పట్టు పరిశ్రమ అధికారి(ఎస్వో)ను బదిలీ చేసింది. ఇక్కడ పని చేసిన సహాయ అధికారులు, సిబ్బంది ఒకొక్కరు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లినా వారి స్థానంలో కొత్తవారిని నియమించలేదు. ఒక్కో యూనిట్ బాధ్యతలు నిర్వహించేవారు లేక మూతపడింది. ప్రస్తుతం మంచిర్యాల జిల్లా పట్టు పరిశ్రమశాఖ ఏడీ పార్వతిని ఇక్కడ ఇన్‌ఛార్జి అధికారిగా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆమె ఒక్కరే ఉన్నారు. మిగతా సిబ్బంది లేక పరిశ్రమలోని యూనిట్లు మూగబోయాయి. ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపు తగ్గిపోయింది. ఆదివాసీ గిరిజన రైతులకు ఉపాధి కల్పించే పట్టు పరిశ్రమ మూతపడే దశలో ఉన్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు స్పందించి పరిశ్రమను పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**గతమెంతో ఘనం..**

పట్టు పరిశ్రమశాఖ సహాయ సంచాలకులు(ఏడీ) పర్యవేక్షణలో గతంలో పట్టు పరిశ్రమ మూడు పువ్వులు ఆరు కాయలుగా విరసిల్లింది. అధికారులు, సిబ్బందిని నియమించడంతోపాటు ఉచిత శిక్షణ, రాయితీపై పరికరాలను అందించేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసేది. మల్బరీ, దసళి సాగు చేస్తున్న రైతులకు ఐటీడీఏ ద్వారా రాయితీపై బిందు సేద్యం పరికరాలు, మొక్కలు అందజేస్తూ ప్రోత్సహించేవారు. పట్టు పురుగులు పెంచి గూళ్ల ఉత్పత్తి చేసే వారికి ప్రోత్సాహకాలు అందించేవారు. ఉట్నూరులోని కుమురంభీం ప్రాంగంలో ఏర్పాటు చేసిన యూనిట్‌తో దసళి పట్టు వస్త్రాలు నేస్తూ ఉపాధి పొందేవారు.

# ఎరువు తయారీ ఏదీ?

ఆదిలాబాద్ : నివాస గృహాల్లోని సెప్టిక్ ట్యాంకుల్లోంచి సేకరించిన మానవ విసర్జితాలను ఊరి బయట ఎక్కడపడితే అక్కడ పడేయడంతో పర్యావరణానికి హాని కలుగుతోంది. ఇటు పరిసర ప్రాంతాల్లో దుర్వాసనతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలను దూరం చేయడంతోపాటు ఎరువుగా మార్చి పొలాలు, మొక్కల పెంపకానికి సరఫరా చేసి ఆదాయం వచ్చేలా గత ప్రభుత్వం పురపాలక సంఘాల్లో మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆదిలాబాద్ పట్టణ శివారులోని బంగారుగూడ చెత్త డంపింగ్‌యార్డులో పక్కనే కొంత స్థలంలో రూ.2.56 కోట్లు వెచ్చించి యంత్రంను ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య వనరుల ఉద్యానవనం పేరిట ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ప్లాంటు తొలుత విద్యుత్తు సరఫరా లేక నాలుగేళ్లు నిరుపయోగంగా ఉండటంతో అప్పటికే పరికరాలు పాడవుతున్నాయి.

**నాలుగేళ్ల కిందట ప్రారంభించినా..**

నాలుగేళ్ల కిందట 2021 ఆగస్టులో యంత్రం పని ప్రారంభించినా అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. మలాన్ని, నీటిని వేరు చేయడంతోపాటు ఆ నీటిని మొక్కలకు వినియోగించాలనేది ఉద్దేశం. శుద్ధి చేసిన మలాన్ని అక్కడే 15 రోజులపాటు ఎండబెట్టేందుకు ప్రత్యేకంగా సోలార్ విద్యుత్తు ఉన్న షెడ్డు సౌకర్యం కల్పించారు. నీటిని శుద్ధి చేసేందుకు ప్రత్యేక యంత్రం అందుబాటులో ఉంది. ఆ వ్యర్థాలు పూర్తిగా ఎండిన తరువాత పొడి చేసి పంట చేన్లకు ఎరువులను సరఫరా చేయాలనేది లక్ష్యం. కానీ ఆచరణలో కనిపించడం లేదు.

**ఒక్కరైతుకూ అందని ఎరువు**

2 వేల లీటర్ల సామర్థ్యం ఉండే ట్యాంకులు ప్రతి రోజు నాలుగు చొప్పున వస్తే ఎరువుల తయారీకి సులువుగా ఉంటుంది. వారానికి రెండు మూడు ట్యాంకులు మాత్రమే వస్తుండటం, పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో ఆశించిన రీతిలో ఎరువు తయారు కావడం లేదు. ఇప్పటి వరకు ఒక్క రైతుకు ఎరువు ఇచ్చిన దాఖలాలు లేవు. ఆదాయం దేవుడికెరుక. పైగా విద్యుత్తు బిల్లు రూపేణా పురపాలికపైనే భారం పడుతోంది. హైటెన్షన్ విద్యుత్తు సరఫరా ఉండటంతో నెలకు రూ.లక్షపైనే విద్యుత్తు బిల్లు తడిసి మోపెడవుతోంది. ఇవన్నీ చూస్తే అసలు యంత్రం ఎందుకని సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# ఆహార శుద్ధి.. లోపించిన చిత్తశుద్ధి

పెద్దపల్లి : ఔత్సాహిక యువతకు ఉపాధి కల్పించి, ఉత్పత్తులకు విలువలు జోడించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేసే ప్రభుత్వ ప్రయత్నం నెరవేరడం లేదు. ఆహార శుద్ధి పరిశ్రమల స్థాపనలో అడుగు ముందుకు పడటం లేదు. భూముల లభ్యత లేకపోవడంతో పారిశ్రామికీకరణకు ప్రతిబంధకంగా మారింది. గతంలో గుర్తించిన భూములు పరిశ్రమలకు సరిపడకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. భూసేకరణలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులకు దగ్గర ఉన్న జిల్లాలో పరిశ్రమలు విరివిగా స్థాపిస్తే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.

**వసతులకు కరవైన నిధులు**

తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ) ఆధ్వర్యంలో ర్యాకల్‌దేవ్‌పల్లిలో గుర్తించిన స్థలాల్లో పరిశ్రమల స్థాపనకు అవసరమైన రోడ్లు, మురుగు కాలువలు, విద్యుతు వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాల్సి ఉన్నా ఏళ్లుగా కేటాయించడం లేదు. వసతులు కల్పిస్తే ఔత్సాహిక యువత ముందుకురానుంది. జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లో మహిళలు ఆసక్తి చూపుతున్నారు. స్థలాలను సద్వినియోగం చేసుకుంటేనే యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

**ఉత్పత్తుల జాడేది?**

జిల్లాలో సుమారు 2.50 లక్షల ఎకరాల్లో వరి, మిర్చి, పసుపు,



మొక్కజొన్న, కూరగాయలు సాగు అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఇక్కడ 200పైనా రైసు మిల్లులున్నాయి. వ్యవసాయరంగ పరంగా ప్రతి సంవత్సరం రెండు పంటల్లో లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యపురాశులు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ అనుబంధ రంగానికి దగ్గరగా ఉండే ఆహార శుద్ధి పరిశ్రమలనే ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రైస్ మిల్లులు, బియ్యంతో తయారయ్యే తిను బండారాల తయారీ, ఇతరత్రా ఉత్పత్తుల తయారీ పరిశ్రమలతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఆశయం అటకెక్కింది.

**స్థలాల సమస్యే ప్రధానం**

ఆహారశుద్ధి పరిశ్రమలకు కనీసం 400 ఎకరాల్లోపు ఉండాలి. ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లిలో 102 ఎకరాలు గుర్తించారు. సమీప ప్రాంత రైతులు మరి కొన్ని భూములు ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. అందుబాటులో ఉన్న భూముల్లో పరిశ్రమలు నెలకొల్పే చర్యలు తీసుకోవడం లేదు.

**రైతులు ముందుకు రావాలి**

మహేశ్వర్, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్, ఉమ్మడి కరీంనగర్

జిల్లాలో ర్యాకల్‌దేవులపల్లి 102 ఎకరాలు మాత్రమే లభ్యమైంది. చుట్టుపక్కల రైతులు స్థలాలు ఇవ్వడం లేదు. ముందుకొచ్చి స్థలాలు ఇస్తే ప్రభుత్వం తరపున పరిహారం చెల్లించనుంది. గుర్తించిన స్థలాల్లో మౌలిక వసతులకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకుంటాం.

# ఉత్సాహం.. ఉసూరుమంటోంది

సిరిసిల్ల: ఆహారశుద్ధి.. టెక్స్‌టైల్.. అపరెల్ ఉత్పత్తుల పరిశ్రమల కోసం జిల్లాలో వేర్వేరు చోట్ల 450 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. అందులో ఇప్పటివరకు ఏర్పాటైనవి కేవలం మూడు పరిశ్రమలు మాత్రమే. మిగతా వందలాది ఎకరాల భూములు నిరుపయోగంగా ఉన్నాయి. జిల్లాలో మరమగ్గాల వస్త్రోత్పత్తిలో అనుబంధ పరిశ్రమలు లేక అయిదు దశాబ్దాలుగా ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితులు. దీంతో జిల్లాలో ఎగుమతి రకాలకు చెందిన వస్త్రోత్పత్తులకు అవకాశం లేదు. ఈ కారణంగా పరిశ్రమ తరచూ ఆటుపోట్లను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడి.. ఇతర రాష్ట్ర ఉత్పత్తులతో పోటీపడాలంటే.. జిల్లా వస్త్రోత్పత్తుల్లో అనుబంధ పరిశ్రమల విస్తరణతోనే సాధ్యం. పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తున్నా.. వారికి సరైన సహకారం అందడంలేదు. ఆయా కారణాల వల్ల ఈ రంగంలో ఉపాధి అవకాశాలు నానాటికీ తగ్గిపోతున్నాయి.

**అత్యధిక మరమగ్గాలు ఇక్కడే**

రాష్ట్రంలో అత్యధికంగా మరమగ్గాలు ఉన్నది సిరిసిల్లలోనే. ఇక్కడి వస్త్ర పరిశ్రమకు అయిదు దశాబ్దాలకు పైగా చరిత్ర ఉంది. జిల్లాలో నిత్యం ఆరు లక్షల మీటర్ల వస్త్రోత్పత్తిచేసే సామర్థ్యం ఉంది. కాటన్‌లో కేస్‌మెట్. పాపిలిన్ రకానికి మంచి డిమాండ్ ఉంది. ఈ వస్త్రం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. కానీ ఇక్కడ ఈ వస్త్రం సైజింగ్, ప్రాసెసింగ్, ప్రింటింగ్‌కు ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తోంది. జిల్లాలోనే ఔత్సాహిక వస్త్రోత్పత్తిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం అందించాలి. స్థానికంగా పరిశ్రమల కోసం సేకరించిన స్థలంలో భూమి కేటాయిస్తే వస్త్రపరిశ్రమ విస్తరణకు అవకాశం ఉంటుంది. దీంతో ఎగుమతి రకాల వస్త్రోత్పత్తులతోపాటు.. స్థానికంగా ఉన్న నేత కార్మికులకు ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయి. పరిశ్రమలో నిలకడ ఏర్పడుతుంది.

**ఇతర రాష్ట్రాలకు పంపాల్సి వస్తోంది**

జిల్లా మరమగ్గాలపై వస్త్రోత్పత్తులకు అవసరమైన నూలును ఎక్కువగా గుంటూరులోని స్పిన్నింగ్ మిల్లుల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఇక్కడ అద్దకం యూనిట్లు లేవు. ఇందుకోసం మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్‌లకు పంపుతున్నాం. ఎగుమతులు, దిగుమతులకే భారీగా ఖర్చవుతోంది. జిల్లాలోనే ఉమ్మడి వసతుల కేంద్రం ఏర్పాటుకు రూ.55 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశాం. ప్రభుత్వం చొరవ తీసుకుని స్థలం కేటాయిస్తే.. పరిశ్రమల శాఖ ప్రోత్సాహంతో యూనిట్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాం.

రిక్కమల్ల శివరామకృష్ణ, ఎంఆర్ టెక్స్‌టైల్స్, అశోక్‌నగర్

ఏడాదిగా ప్రయత్నిస్తున్నా ఫలితంలేదు

సిరిసిల్లలో నైపుణ్యం కలిగిన కార్మికులు ఉన్నారు. ఇక్కడి పరిశ్రమ అయిదు దశాబ్దాలుగా ముడి సరకును దిగుమతి చేసుకుని వస్త్రోత్పత్తులకే పరిమితమైంది. తరాలు మారుతున్నా వస్త్రోత్పత్తుల్లో మార్పు రావడంలేదు. అనుబంధ రంగాల పరిశ్రమల విస్తరణకు మాకు ఆసక్తి ఉన్నా.. దానికి తగిన సహకారం లభించడంలేదు. సిరిసిల్లలో వందల ఎకరాల్లో ప్రత్యేక పరిశ్రమల జోన్ ఏర్పాటు చేశారు. జిల్లాలో టీజీఐఐసీ కార్యాలయంలేదు. ఏడాదిగా ప్రభుత్వ ప్రతినిధులను కలుస్తున్నా ఫలితం లేదు. మ్యాన వేణుగోపాల్, సుభాష్‌నగర్

# పంట పొలాల్లో సౌర వెలుగులు



తెలంగాణ : పర్యావరణ పరిరక్షణ, సంప్రదాయ వనరులను ప్రోత్సహించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇప్పటికే ఇంటింటా సౌర వెలుగులు తేవడానికి సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తుండగా.. తాజాగా పంట పొలాల్లో సౌర వెలుగులు నింపాలనే ఉద్దేశంతో పీఎం-కుసుమ్ (ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్) పథకం కింద సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా ఉపాధి పొందడానికి వీలుంటుంది. ఆసక్తి గల రైతులు (వ్యక్తిగతంగా), రైతు, సహకార, మహిళా సంఘాలు, మండల సమాఖ్యలు, ఇతరులు టీఎస్-రెడ్కో (తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ)కు సంబంధించిన వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఈనెల 10 వరకు దరఖాస్తులు స్వీకరించింది.

**అర్హులు.. ఎంపిక విధానం**

కుసుమ్ పథకం ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలనుకునేవారికి సబ్‌స్టేషన్‌కు 5 కిలోమీటర్ల పరిధిలో నాలుగెకరాల భూమి ఉన్న రైతు లేదా లీజుకు తీసుకున్నవారు అర్హులు. ఒక మెగావాట్ ఉత్పత్తి చేయాలంటే దాదాపు రూ.3 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో పది శాతం వాటా భరిస్తే, 90 శాతం బ్యాంకులు రుణంగా ఇవ్వనున్నాయి. ఒక్కో సబ్‌స్టేషన్ పరిధిలో 2 మెగావాట్లు ఉత్పత్తి చేయడానికి వీలుంటుంది. రెడ్కో, సబ్‌స్టేషన్‌కు సంబంధించిన అధికారులు సర్వే చేసి అనుమతించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లాకు 2 మెగావాట్ల చొప్పున మహిళా సంఘాలకు కేటాయించారు. ఇందుకు అవసరమైన భూమిని కూడా కేటాయించారు. కాకపోతే ప్రభుత్వ భూములను కేటాయించొద్దని కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లు తెలిసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉందని సమాచారం.

**మహిళా సంఘాలకు 120 మెగావాట్లు**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 520 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఇందులో 120 మెగావాట్లు ఎస్‌హెచ్‌జీ(మహిళా) సంఘాలకు కేటాయించారు. నాలుగు జిల్లాల్లో 100 మెగావాట్ల చొప్పున సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. వీటిని రైతులు, సహకార, మహిళా స్వశక్తి సంఘాలతో నెలకొల్పనున్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద జిల్లాకు రెండు గ్రామాల చొప్పున 8 గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా ప్లాంట్ల నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్తును డిస్కంలు కొనుగోలు చేయనున్నాయి. రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి నిర్ణయించిన ధర ప్రకారం ఒక్కో యూనిట్‌కు రూ.3.18 చొప్పున ఉత్పత్తిదారులకు చెల్లించనుంది. మహిళా సంఘాల నుంచి వచ్చిన దరఖాస్తులు కాకుండా కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 600.8 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం 468 దరఖాస్తులు రావడం విశేషం.

ఉమ్మడి జిల్లాలో 8 మహిళా సంఘాల ఎంపిక..

కరీంనగర్ : దత్తోజీపేట, ఘన్ముకుల

పెద్దపల్లి : సిరిపురం, కాల్వశ్రీరాంపూర్

జగిత్యాల : తాటిపల్లి, స్తంభంపల్లి రాజన్న సిరిసిల్ల : ముష్టిపల్లి, ధర్మారం.

# ప్రయాణ ప్రాంగణం.. అందని శుద్ధ జలం!



కరీంనగర్ : ఎండలు మండుతున్నా పలు ప్రయాణ ప్రాంగణాల్లో శుద్ధ జలం అందక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.. ఎక్కువ శాతం సీసా నీళ్లనే నమ్ముకుంటున్నారు.. ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్నవారు కొందరైతే.. కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నవారు మరికొందరు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 ప్రధాన ప్రయాణ ప్రాంగణాలను పరిశీలించగా ఎనిమిదింటిలో శుద్ధ జలం సౌకర్యం లేదు..

**ఇక్కడ బాగు**

రోజుకు లక్ష మంది రాకపోకలు సాగించే కరీంనగర్ బస్టాండ్‌లో 4 వాటర్ కూలర్లు అందుబాటులో ఉన్నాయి.

70 వేల మంది ప్రతి రోజూ గోదావరిఖని బస్టాండ్ నుంచి ప్రయాణిస్తుండగా ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధ జలం అందుతోంది.

మెట్‌పల్లి బస్టాండు నుంచి నిత్యం 50 వేల మంది ప్రయాణిస్తుంటారు. స్వచ్ఛంద సంస్థ శుద్ధ జలాన్ని అందిస్తోంది.

రోజూ 40 వేల మంది ప్రయాణించే కోరుట్ల బస్టాండ్‌లో శుద్ధ నీటి యంత్రం అందుబాటులో ఉంది.

నిత్యం 25- 30 వేల మంది ప్రయాణికులు వచ్చే వేములవాడ బస్టాండ్‌లో ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధ జలాన్ని అందిస్తున్నారు.

జగిత్యాల బస్టాండ్ ద్వారా నిత్యం 30 వేల మంది ప్రయాణిస్తుండగా పురపాలిక నీటిని నింపి వాటర్ కూలర్ ద్వారా అందించే ఏర్పాటు చేశారు.

**ఇవీ సమస్యలు**

హుజూరాబాద్ బస్టాండ్ నుంచి నిత్యం 35వేల మంది ప్రయాణిస్తుంటారు. ఆర్వో ప్లాంటు నీరు తెచ్చి ఫ్రిజ్ ద్వారా సరఫరా చేస్తున్నారు. ఫ్రిజ్ వద్ద అపరిశుభ్రంత ఇబ్బందిగా ఉంది.

జమ్మికుంట బస్టాండ్‌కు ప్రతి రోజు 10 వేల మంది ప్రయాణికులు వస్తుంటారు. ఆర్వో ప్లాంట్ నీటిని తెచ్చి ఫ్రిజ్‌లో పోసి అందిస్తున్నా సరిపోవడం లేదు.

నిత్యం 3 వేల మంది వచ్చే చొప్పదండి బస్టాండ్‌కు ఓ సంస్థ ఫ్రిజ్ బహూకరించగా బబుల్స్ నీటిని పోస్తున్నారు. ఉదయం పూట మాత్రమే సరిపోతున్నాయి.

సిరిసిల్ల బస్టాండ్ నుంచి నిత్యం 32 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. కొత్త బస్టాండ్‌లో తాగునీటి వసతి లేదు. పాత బస్టాండ్‌లో నేరుగా బోరు నుంచి వచ్చే నీటిని ఫ్రిజ్ ద్వారా అందిస్తున్నారు. సుల్తానాబాద్ బస్టాండ్ నుంచి ప్రతి రోజు వెయ్యికి పైగా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. శుద్ధి చేసిన నీటిని కాకుండా నేరుగా బోరు బావి నుంచి వచ్చే నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ ప్రాంతం కూడా అపరిశుభ్రంగా ఉంది. ధర్మపురి బస్టాండ్‌లో పబ్లిక్ నల్లా నీటితో సంపును నింపుతున్నారు. నల్లా కనెక్షన్ ఉన్న ప్రాంతం కూడా అపరిశుభ్రంగా మారింది.

పరిశీలించిన బస్టాండ్‌లు : 14

రోజూ ప్రయాణికుల రాకపోకలు : 3.5 లక్షల మంది

# స్తంభానికో లెక్క.. నాణ్యమైన సరఫరా పక్కా




పెద్దపల్లి : వేసవిలో విద్యుత్తు కోతలు, లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించే దిశగా కార్యాచరణ చేపట్టిన విద్యుత్తు సంస్థ క్షేత్రస్థాయిలో విద్యుత్తు అంతరాయాలను త్వరగా తెలుసుకునేందుకు పోల్‌మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 33 కేవీ, 11 కేవీలతోపాటు ఎల్‌టీ విద్యుత్తు లైన్ల స్తంభాలకు యూనిక్ నంబర్లను రాయిస్తుంది. ఉప కేంద్రాలకు విద్యుత్తు సరఫరా చేసే 33 కేవీ, ఉప కేంద్రాల నుంచి విద్యుత్తు నియంత్రికల వరకు వెళ్లే 11 కేవీ ఫీడర్లకు తాజాగా నంబర్లు కేటాయించారు. జిల్లాలో రెండు రోజులుగా 33 కేవీఏ ఫీడర్లకు 28, 11కేవీఏ పీడర్లకు 158 స్తంభాలకు నంబర్లు కేటాయించారు. వానాకాలం నాటికి జిల్లాలోని అన్ని విద్యుత్తు స్తంభాలకు నంబరింగ్ ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు తయారు చేసుకున్నారు.

**ప్రయోజనాలు ఇవి..**

స్తంభాలకు నంబర్ల కేటాయింపు గ్రామం లేదా పట్టణాలోని ఫీడర్ యూనిట్‌గా జరుగుతుంది.

వివిధ ఫీడర్ల పరిధిలో జరిగిన నంబర్లకు జియో ట్యాగింగ్ చేస్తారు.

విద్యుత్తు తీగలు తెగిపోయినా, స్తంభాలు విరిగినా స్థానికులు సమాచారం ఇవ్వడం ద్వారా కొత్తగా విధుల్లోకి వచ్చిన వారు కూడా నేరుగా అంతరాయం జరిగిన ప్రాంతానికి చేరుకుంటారు.

దీంతో మరమ్మతు ప్రక్రియ వేగంగా పూర్తి చేయడంతో అంతరాయాలకు ముగింపు పడుతుంది.

వేసవిలో లో వోల్టేజీ సమస్యలను నివారించేందుకు విద్యుత్తు అధికారులు నెలరోజులుగా చేపట్టిన విద్యుత్తు ఉపకేంద్రాల నవీకరణ (అప్‌గ్రేడ్షన్) ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.

జిల్లాలో 200 ప్రాంతాల్లో నియంత్రికలను నవీకరణ చేసేందుకు ప్రతిపాదించామని పెద్దపల్లి సర్కిల్ పర్యవేక్షకాధికారి మాధవరావు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో గద్దెల నిర్మాణం పూర్తయిందని.. నియంత్రికలు వచ్చిన వెంటనే బిగిస్తామని పేర్కొన్నారు.

# ఆదాయం ఘనం.. అభివృద్ధి శూన్యం

భువనగిరి : భువనగిరి మార్కెట్ కమిటీ ఆదాయ లక్ష్యం సాధిస్తున్నప్పటికీ అభివృద్ధి అంతంతగానే ఉంది. మూడేళ్లుగా సాధించిన ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకుని దానికి 20 శాతం పెంచి మరో సంవత్సరానికి ఆదాయ లక్ష్యం నిర్ణయిస్తారు. పెంచిన ఆదాయం సైతం సాధిస్తున్నప్పటికి అభివృద్ధిలో ప్రగతి కనిపించకపోవడం గమనార్హం. కొత్త మార్కెట్ కార్యాలయాన్ని నిర్మించేందుకు రూ.5.20 కోట్లతో పనులు ప్రతిపాదించినప్పటికి నేటికీ నిధులు మంజూరు కాలేదు. అనంతారం శివారులో నిర్మించనున్న కొత్త మార్కెట్ యార్డుకు నేటికీ



పూర్తి స్థాయిలో నిధులు మంజూరు కాలేదు. అరకొర నిధులతో ప్రహరీ పనులు కొనసాగుతున్నాయి. గతంలో మార్కెట్ నిధులతో గ్రామాల మధ్య అంతర్గత రోడ్లు, యార్డు అభివృద్ధి నిర్మాణాలు, గోదాంలు నిర్మించేవారు. ప్రస్తుతం ఆయా పనులు చేపట్టడం లేదు. వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలపై మార్కెట్ కార్యాలయానికి ఒక శాతం పన్ను, ట్రేడ్ లైసెన్స్‌లు, గోదాంల అద్దెతో ఆదాయం లభిస్తుంది. వస్తున్న ఆదాయానికి అనుగుణంగా అభివృద్ధి చేపడితే రైతులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఈ విషయమై ఇన్‌ఛార్జి మార్కెట్ కార్యదర్శి ఎల్లయ్యను వివరణ కోరగా.. నిర్మాణ పనులు ఏవీ ప్రతిపాదించలేదని, కార్యాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించామన్నారు.

# ఆ ఎనిమిదే టాప్..!

హుజూర్‌నగర్, రాష్ట్రంలో టెండర్ ద్వారా ధాన్యం అమ్మినా.. ఆ ధాన్యం గుత్తేదారుకు ఇవ్వని మిల్లర్లు జిల్లాలో ఎనిమిది మంది ఉన్నారు. అంతేనా అనుకుంటున్నారా..! వారి నుంచి రావాల్సిన ధాన్యం విలువ రూ.273 కోట్లు. ఇదిగో.. అదిగో అంటూ 16 నెలలుగా ఆదేశాలను ఖాతరు చేయని ఆ ఎనిమిది మిల్లులు రాష్ట్రంలోనే టాప్‌లో ఉన్నాయి. వారు ఇవ్వడం లేదా.. లేక వద్దులే అనుకున్నారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలా ఉండగా తాజాగా ఆ ధాన్యం అప్పగించేందుకు ప్రభుత్వం తిరిగి వారికి మరో మూడు నెలల గడువు పెంచి మరో అవకాశం ఇచ్చింది. ఇటీవలే రాష్ట్రానికి సంబంధించిన ఒక సంస్థ ధాన్యం అక్రమార్కులపై నేరుగా సీబీఐ డైరెక్టర్ జోనల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది.



**చిక్కుముడి ఇదీ..** ప్రభుత్వం ఐకేపీ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం నాణ్యత లేదని మిల్లర్లు గగ్గోలు పెట్టడంతో 2022-23 యాసంగి ధాన్యాన్ని గ్లోబల్ టెండరు ప్రక్రియ ద్వారా అమ్మింది. ధాన్యం అమ్మేనాటికి దాన్ని అప్పటికే మిల్లులకు కేటాయించారు. రకరకాల కారణాలు చెబుతూ వారు ధాన్యాన్ని తమకే అమ్మాలని కోరుతూ వేలంలో దక్కించుకున్న గుత్తేదారుకు అప్పగించలేదు. దీనిపై ప్రభుత్వంలో చర్చలు కూడా జరిగాయి. చివరకు ధర విషయంలో తేడాలు ఉండటంతో ప్రభుత్వం వాటిని వేలం ద్వారా అమ్మకాలు జరిపింది. ఆ తరువాత ధాన్యం అప్పగించకపోవడం వల్ల టెండరుదారు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సొమ్మును ఇవ్వడం లేదు. మిల్లర్లు ధాన్యం ఇవ్వడం లేదు. రకరకాలుగా ఒత్తిడి తీసుకురావడంతో కొందరు మిల్లర్లు అప్పగించారు. 15 నెలలైనా నేటికీ కొందరు అప్పగించని వారున్నారు. అందులో నేరేడుచర్ల, గరిడేపల్లి, కోదాడ, తిరుమలగిరి ప్రాంతాలకు చెందిన మిల్లులు ఉన్నట్లు సమాచారం. గుత్తేదారు నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకాయి మొత్తం చెల్లించేందుకు, మిల్లర్లు బకాయి ధాన్యం గుత్తేదార్లకు అప్పగించేందుకు తాజాగా గడువు పెంచింది. డిసెంబరు 31తోనే గడువు ముగిసినప్పటికీ మిల్లర్లు మరికొంత సమయం కోరడం వల్ల గడువు పెంచినట్లు విశ్వసనీయ సమాచారం.

# ఇక్కడంతా షరా మామూలే!

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంతర్రాష్ట తనిఖీ కేంద్రాలపై ఉన్నతాధికారుల నిఘా కొరవడుతోంది. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ), అసిస్టెంట్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐ)ల విధుల నిర్వహణ ఇష్టారాజ్యంగా సాగుతోంది. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం భోరజ్, నిర్మల్ జిల్లా బేల్‌తరోడ, కుమురంభీం జిల్లాలోని వాంకిడి చెక్‌పోస్టుల మీదుగా సాగే వాహనాల తాత్కాలిక అనుమతి(టీఆర్), సరకుల రాష్ట్ర పన్నుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు చెందాల్సిన ఆదాయాన్ని కొంతమంది అధికారులు కొల్లగొడుతున్నారు.

విచారణ లేక అనిశా అధికారులు గత డిసెంబరు 5న భోరజ్ చెక్‌పోస్టులో చేసిన ఆకస్మిక సోదాల్లో లెక్కల్లోకిరాని నగదు లభ్యమైంది. ఆ తర్వాత ఎలాంటి విచారణ లేకపోవటంతో షరా మామూలుగా మారిపోయింది. ఆదిలాబాద్, భోరజ్, బేల్‌తరోడలోని ఒక్కొక్కరి చొప్పున ముగ్గురు అధికారులు తీసుకునే వ్యక్తిగత నిర్ణయాలకు అనుగుణంగా ఉమ్మడి జిల్లా చెక్‌పోస్టుల్లో విధి నిర్వహణ సాగుతున్నందున ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఉమ్మడి జిల్లా రవాణాశాఖ కార్యకలాపాలపై అజమాయిషీ చేయాల్సిన ఓ అధికారి సైతం అంటీముట్టనట్లు వ్యవహరించటం అక్రమాలను ప్రోత్సహించినట్లవుతోంది.

**విమర్శలకు తావిస్తున్న అనిశా కేసు** భోరజ్ చెక్‌పోస్టులో డిసెంబరు 5న లభించిన రూ.62,500 వ్యవహారం మరుగున పడింది. ఆ రోజు విధుల్లో ఉన్నదెవరు? లెక్కల్లోకి రాని డబ్బులకు కారణాలేమిటి? అనే కోణంలో అనిశా సమగ్ర దర్యాప్తు చేయాల్సి ఉండగా ప్రాధాన్యత లేనట్లు వదిలేయటం విమర్శలకు తావిస్తోంది. ఆ డబ్బులు ఎవరికీ సంబంధం లేదనే రీతిలో మరుగునపడేలా చేయటంలో రవాణాశాఖలోని ఇద్దరు అధికారులు హైదరాబాద్ స్థాయిలో చక్రం తిప్పినట్లు సమాచారం. ఈ విషయమై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అనిశా డీఎస్పీ విజయ్‌కుమార్‌ని ఫోన్‌లో సంప్రదించగా ఆ కేసు వివరాలేవీ తనకు తెలియదని, తాను జనవరిలో విధుల్లో చేరానని చెప్పారు.

# ఆస్తి పన్ను కడితేనే రిజిస్ట్రేషన్

హైదరాబాద్ : ఆస్తిపన్ను చెల్లించకుండా.. ఆస్తులు అమ్ముకుంటున్న వారిని నిలువరించేందుకు జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. కర్ణాటక రాష్ట్రంలో మాదిరి పన్ను బకాయిల్లేని ఆస్తులనే రిజిస్ట్రేషన్ చేసే నిబంధన హైదరాబాద్‌కు అవసరమని భావిస్తోంది. ఆస్తిపన్ను బకాయిలు రూ.9వేల కోట్ల మేర పేరుకుపోవడంతో బల్దియా ఈ నిర్ణయం తీసుకుంది.రాష్ట్రంలో మెజారిటీ సబ్‌రిజిస్ట్రార్లు తాము చట్ట ప్రకారమే పత్రాలను పరిశీలిస్తామని బల్దియాకు తేల్చి చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఆస్తిపన్ను బకాయిలతో ముడిపెట్టి రిజిస్ట్రేషన్లను నిలిపేయలేమని, ఇది చట్ట




సవరణతోనే సాధ్యమని పేర్కొన్నారు.

**బకాయిల పోటుతో..** ప్రస్తుతం ఆస్తిపన్ను పరిధిలో 23 లక్షల నిర్మాణాలున్నాయి. అందులో దాదాపు ఐదు లక్షల భవనాలు సరిగా పన్ను చెల్లించడం లేదు. 15ఏళ్లు, అంతకన్నా ఎక్కువ కాలం నుంచి బల్దియాకు పన్ను చెల్లించని నిర్మాణాలు దాదాపు 5వేలు ఉంటాయని, అందులో 90శాతం వాణిజ్య భవనాలేనని సమాచారం. ఇటీవల కమిషనర్ ఇలంబర్తి జోన్ల వారీగా అత్యధికంగా పన్ను బకాయిలున్న 25 నిర్మాణాల జాబితాను ఆయా జోనల్ కమిషనర్లకు పంపించి చర్యలు తీసుకోవాలన్నారు.

**ఆ రాష్ట్రంలో ఇలా..**
సబ్‌రిజిస్ట్రారు ఇంటి నంబరు లేదా పీటీఐఎన్(ప్రాపర్టీ టాక్స్ ఐడెంటిఫికేషన్ నంబరు)ను పొందుపరచగానే పన్ను బకాయి ఎంతో కంప్యూటర్‌లో ప్రత్యక్షమవుతుంది. బకాయి ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగదు. బెంగళూరు మహా నగరపాలక సంస్థ ఇంటి విస్తీర్ణం ఆధారంగా ఆస్తిపన్నులో చెత్త పన్నును జమ చేస్తోందని, ఇక్కడ స్వచ్ఛ ఆటోలు రుసుము వసూలు చేసుకుంటున్నాయని అధికారులు గుర్తు చేస్తున్నారు.

# అభివృద్ధికి ఉందో ప్రణాళిక

హైదరాబాద్: హెచ్ఎండీఏ పరిధి పెంచడంతోపాటు పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయి. ఈ తరుణంలో రానున్న బడ్జెట్‌పై హెచ్ఎండీఏ భారీ ఆశలు పెట్టుకుంది. ఉత్తర తెలంగాణకు నగరంతో పూర్తి స్థాయిలో అనుసంధానం చేసేందుకు ఎలివేటెడ్ కారిడార్లకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఫోర్త్ సిటీలో భాగంగా తొలుత రోడ్డు నెట్‌వర్క్‌ను కల్పిస్తోంది. ఈ మొత్తం పనులకు నిధుల కొరత అవరోధంగా మారింది. నిర్మాణ, లేఅవుట్ల అనుమతులు, భూముల వేలం, ఇతర ఫీజుల రూపంలో హెచ్ఎండీఏకు ఏటా రూ.1000 నుంచి రూ.1200 కోట్లు వరకు ఆదాయం సమకూరుతోంది. గతేడాది ఒక్క అవుటర్ రింగ్ లీజు రూపంలో రూ.7300 కోట్లు హెచ్ఎండీఏ ఖాతాలో వచ్చి పడ్డాయి. అంతకుముందు విలువైన ప్రాంతాల్లో భూముల వేలం ద్వారా రూ.3-4 వేల కోట్లు వచ్చాయి. రాజీవ్ రహదారికి అనుసంధానంగా ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ వరకు 18.124 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనుంది. ఇందుకు భూసేకరణ,




పరిహారం చెల్లింపులతోపాటు రహదారి ఖర్చుతో కలిపి రూ.3619 కోట్లు అవసరం.ఎన్‌హెచ్ 44కి అనుసంధానంగా ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిర్‌ఫాం వరకు 5.4 కిలోమీటర్ల పొడవుతో మరో ఎలివేటెడ్ కారిడార్‌కు ఇప్పటికే టెండర్లు ఆహ్వానించింది. భూసేకరణ, పరిహారంతో కలిపి ఈ ప్రాజెక్టుకు రూ.1487 కోట్లు కావాలి.
ఫోర్త్ సిటీని మహానగరంతో అనుసంధానించేందుకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పిలిచింది. అవుటర్ రింగ్ రోడ్డు ఇంటర్‌ఛేంజ్ రావిర్యాల నుంచి ప్రతిపాదిత ఆర్ఆర్ఆర్ పరిధిలోని ఆమనగల్లు వరకు దాదాపు 41 కిలోమీటర్ల ఆరు లైన్లలో రహదారి నిర్మించనున్నారు. ఫేజ్-1కు భూసేకరణ, పరిహారం, ప్రాజెక్టు వ్యయంతో కలుపుకొని రూ.1665 కోట్లు, రెండో ఫేజ్‌కు రూ.2365 కోట్లు అవసరం.

# ప్రజలకు చేరువలో మీ సేవలు

రాయికల్ : అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు జాప్యం లేకుండా నిర్దిష్టమైన పద్ధతిలో అందించాలన్న ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం 'సులభంగా.. వేగంగా' నినాదంతో 2011లో మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దశల వారీగా నూతన సేవలను అందుబాటులోకి తెస్తూ రెవెన్యూ, రవాణా, పోలీస్, జీహెచ్ఎంసీ, మున్సిపల్, విద్యుత్తు, ఎండోమెంట్, వ్యవసాయ, రిజిస్ట్రేషన్, పౌర సరఫరా, విద్యా శాఖకు చెందిన ప్రస్తుతం సుమారు 300 రకాల పౌర సేవలు అందిస్తున్నారు. మూడు ప్రభుత్వ, 169 టీఎస్‌టీఎస్, 21 టీఎస్ఆన్‌లైన్, 31 ఇతర మీసేవ కేంద్రాలు మొత్తంగా జిల్లాలో 224 మీసేవ కేంద్రాలున్నాయి.

**జాబితాలో మరో తొమ్మిది..** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మరో 9 రకాల సేవలను మీసేవ జాబితాలో చేర్చింది. రెవెన్యూ పరిధిలోని సేవలతో పాటు అటవీ శాఖకు సంబంధించిన నూతన ఐచ్ఛికాలను అందుబాటులోకి తెచ్చింది. రెండు విద్యా కోర్సుల మధ్య గ్యాప్ పీరియడ్‌ను ధ్రువీకరించడానికి గ్యాప్ సర్టిఫికెట్, పౌరుల పేరు మార్పిడి, పౌరుల స్థానికతను నిర్ధరించేలా లోకల్ క్యాండిడేట్(స్థానిక అభ్యర్థి) సర్టిఫికెట్, మైనార్టీలకు మైనార్టీ పథకాలు, ఉపకారవేతనాలు, రిజర్వేషన్ వంటి అంశాలను ధ్రువీకరించేలా మైనార్టీ సర్టిఫికెట్, కులం, ఆదాయ ధ్రువపత్రాల పునఃజారీ(రీఇష్యూ), వెనుకబడిన తరగతులకు చెందిన వారికి క్రిమీలేయర్-నాన్ క్రిమీలేయర్ ధ్రువపత్రం, వయో వృద్ధుల నిర్వహణ కేసులు, పర్యవేక్షణ వ్యవస్థ వంటి సేవలు రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్నాయి. వన్యప్రాణుల దాడిలో మరణించిన వ్యక్తులు, జంతువులకు సంబంధించి అందించే నష్టపరిహారం, కలప(టింబర్) డిపోలు, సామిల్ అనుమతులు, రెన్యూవల్, నిర్వహణ వంటి అటవీ శాఖ సేవలు నూతనంగా మీసేవ కేంద్రాల్లో అందుబాటులోకి వచ్చాయి.

# నీటిని చెరబట్టి.. డబ్బులు చక్కబెట్టి



హైదరాబాద్ : ఐటీ కారిడార్‌లో తాగునీటి సరఫరా తక్కువగా ఉండడంతో కొందరు ప్రైవేటు వ్యక్తులు జలదోపిడీకి తెర తీశారు. గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్‌తోపాటు జంట జలాశయాల పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, మైదాన ప్రాంతాల్లో బోర్లు వేసి.. నీటిని తోడి ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తున్నారు. ట్యాంకర్‌కు రూ.2-4 వేలు వసూలు చేస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు.
రోజుకు కనిష్ఠంగా వెయ్యి ట్యాంకర్లు.. గరిష్ఠంగా మూడు వేల ట్యాంకర్ల నీటిని అక్రమంగా తోడేస్తున్నారు. శేరిలింగంపల్లి, గండిపేట మండలాల్లో నీటి వ్యాపారం రెండు వారాలుగా రాత్రింబవళ్లు కొనసాగుతోంది. గండిపేట చెరువు, నార్సింగి, వట్టినాగులపల్లి, ఖాజాగూడ, పుప్పాలగూడ, లింగంపల్లి, శంషాబాద్ ప్రాంతాల్లో సుమారు రెండు వందలకుపైగా ప్రాంతాల్లో బోర్లు తవ్వి భూగర్భ జలాలను తోడుతున్నారు.
భూగర్భ జలమట్టం పడిపోవడం, బోర్ల ద్వారా నీళ్లను లాగేస్తుండడంతో శంషాబాద్, రాజేంద్రనగర్ ప్రాంతాలతోపాటు ఐటీ కారిడార్‌లోని 60కిపైగా ఐటీ సంస్థలు, 200 గేటెడ్ కమ్యూనిటీలు, పది వేలకుపైగా అపార్ట్‌మెంట్లలో తాగునీటి సమస్యలు మొదలయ్యాయి.
ప్రైవేట్ వ్యక్తుల అక్రమాలు తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. వట్టి నాగులపల్లిలో కొన్ని రోజుల క్రితం యాభై బోర్లను సీజ్ చేశారు. తొట్టెలు, భారీ సంప్‌లను పొక్లెయిన్లతో కూల్చేశారు.ఖాళీ స్థలాలు.. చెరువులు.. జంట జలాశయాలు
గండిపేట, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, శంషాబాద్ మండలాల్లో ఖాళీ స్థలాలు, చెరువులు, జంట జలాశయాలను లక్ష్యంగా చేసుకుని కొందరు ప్రైవేట్ వ్యక్తులు బోర్లు వేసి భూగర్భ జలాలను తోడేస్తున్నారు. ఒకేచోట నాలుగైదు బోర్లు వేస్తున్నారు.
పెద్ద గొయ్యి తవ్వి గట్టి ప్లాస్టిక్, టార్పాలిన్‌ను వేసి.. దాన్ని తొట్టిగా చేస్తున్నారు. రాత్రి బోర్లతో నీళ్లను తొట్టిలోకి పంపి.. ట్యాంకర్లను నింపి ఐటీ కారిడార్‌కు తరలిస్తున్నారు.
హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌ల సమీపంలో బోర్లతో ట్యాంకర్లను నింపి నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల్లోని అపార్ట్‌మెంట్లకు సరఫరా చేస్తున్నారు. **డిమాండ్ ఆధారంగా సరఫరా...**
గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ, రాయదుర్గం, గోపన్‌పల్లి, లింగంపల్లి, నార్సింగి, కోకాపేట, పుప్పాలగూడ, గండిపేట ప్రాంతాల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. ట్యాంకర్ల యజమానులు మైదాన ప్రాంతాలు, వ్యవసాయ భూముల్లో యుద్ధప్రాతిపదికన బోర్లు వేసి నీటిని తోడేస్తున్నారు. గతంలో రూ.1000- 1500 వరకు ట్యాంకర్ నీటిని సరఫరా చేస్తుండగా... ప్రస్తుతం రూ.2 వేలు డిమాండ్ చేస్తున్నారు. స్వచ్ఛమైన తాగునీరు అంటూ కొన్ని ప్రాంతాల్లో రూ.4 వేలు వసూలు చేస్తున్నారు. మైదాన ప్రాంతాలు, వ్యవసాయ భూముల్లో బోర్లు వేస్తున్నట్లు దృష్టికి రాగానే వాటిని ధ్వంసం చేస్తున్నామని గండిపేట్ తహసీల్దార్ ఎన్.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. విద్యుత్తు, పోలీస్ శాఖల అధికారులతో కలిసి బోర్లు వేస్తున్న ప్రాంతాలకు వెళ్లి నిర్వాహకులను అరెస్ట్ చేయిస్తున్నామని తెలిపారు.

# జల గంట.. మోగేనా మన ఇంట




హైదరాబాద్ :మహానగరంలో తాగునీటి సరఫరా, మురుగు నీటి వ్యవస్థ బాధ్యతలు నిర్వర్తిస్తున్న జలమండలి రేపు ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌పై కొండంత ఆశ పెట్టుకుంది. భారీగా నిధులను ఆశిస్తోంది. గత బడ్జెట్‌లో రూ.3385 కోట్లను ప్రతిపాదించినా విడుదలైంది రూ.800 కోట్లే. నిధుల విడుదలలో జాప్యం ప్రభావం నగరంలో తాగునీటి లైన్ల విస్తరణ పనులతో పాటు వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్‌లపై పడింది. ప్రధానంగా మురుగునీటి శుద్ధి ప్లాంట్ల (ఎస్టీపీల) నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కీలకమైన ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాల్సిన నేపథ్యంలో 2025-26 బడ్జెట్ నుంచి జలమండలి రూ.5000 కోట్లను ఆశిస్తోంది.
నగరంలో 8 లక్షల కుటుంబాలకు నెలకు 20 కిలోలీటర్ల నీటిని ఉచితంగా ఇస్తున్నందుకు జలమండలికి ఏటా రూ.300 కోట్లను ప్రభుత్వం నాలుగు విడతలుగా చెల్లిస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకు నిధులు మాత్రం విడుదల కాలేదు.
తాగునీటి వసతుల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన, పటిష్ఠమైన మురుగునీటి వ్యవస్థ ఏర్పాటుకు జలమండలి భారీ ప్రణాళికలను రూపొందించింది. దీంతో పాటు నగరానికి మరో 20 టీఎంసీల గోదావరి జలాలను తీసుకొచ్చేందుకు రూ.7360 కోట్లతో ఇప్పటికే హైబ్రీడ్ యాన్యూటీ విధానంలో టెండర్లను పిలిచింది.తాజాగా ఉస్మాన్‌సాగర్ కాండ్యూట్‌కు సమాంతరంగా మరో పైపులైను ఏర్పాటుకు డీపీఆర్ చేసింది. నగరానికి నిత్యం 45 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్న 1965 నాటి మంజీరా పైపులైన్ స్థానంలో కొత్తదానికి ప్రతిపాదించారు. ఇందుకు రూ.500 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు.ఓఆర్ఆర్ వరకు జలమండలి పరిధి విస్తరించడంతో కొత్తగా అనేక ప్రాంతాలు అంతర్భాగం అయ్యాయి. ఆ ప్రాంతాల్లో తాగునీటి, మురుగునీటి వసతుల కల్పనతోపాటుగా, మూసీ ప్రక్షాళనకు నిర్మిస్తున్న శుద్ధి కేంద్రాలకు మురుగువ్యవస్థలను అనుసంధానం చేయాల్సి ఉంది.

**లోటు... అప్పులతో జలమండలి**
జనవరిలో సీఎం అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో జలమండలి ఆర్థిక పరిస్థితిపై సమీక్షించారు. ప్రస్తుతం రూ.8800 కోట్ల లోటుతో ఉంది. రుణాల చెల్లింపునకు ఇబ్బందులు తప్పడంలేదు. మౌలికసదుపాయాల కల్పనకు పూర్తిగా రుణాలు లేదా ప్రభుత్వం తోడ్పాటుపైనే ఆధారపడుతోంది. ఇప్పటికే రూ.1850 కోట్ల రుణాలున్నాయి. తాజాగా గోదావరి రెండు, మూడు దశలకు రూ.2250 కోట్ల రుణం హడ్కో నుంచి మంజూరైంది. ఇటీవల ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు జలమండలి నిధుల అవసరాన్ని వివరించింది.

# రహదారుల మరమ్మతుపై నిర్లక్ష్యం



కరీంనగర్ : స్మార్ట్‌సిటీతోపాటు ఇతర నిధులతో సుందరంగా తీర్చిదిద్దిన నగర రహదారులు గుంతలుగా మారుతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ తవ్వడం, మరమ్మతులు పూర్తయిన తర్వాత ప్యాచ్ వర్క్ చేయడం విస్మరిస్తుండటంతో ప్రమాదకరంగా తయారవుతున్నాయి. నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన రహదారులపై బీటీ ఉండగా.. అంతర్గత వీధుల్లో సీసీ రోడ్లున్నాయి. జీబ్రా క్రాసింగ్, స్టడ్స్ నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తీర్చిదిద్దారు. వీటితోపాటు అంతర్గత సర్వీసు రహదారులపై సైతం అవసరాలకు తవ్వుతుండటం విమర్శలకు తావిస్తోంది.

**గుంతలతో ఇబ్బందులు**
రహదారులు తవ్వి మరమ్మతులు పూర్తయిన తర్వాత బీటీకి తారు ప్యాచ్ వర్క్ చేయకుండా వదిలేస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత మట్టి, కంకరపొడి కుప్పగా పోసి చేతులు దులుపుకుంటున్నారు. సీసీ రోడ్డుకు ప్యాచ్ చేయాల్సి వస్తే అడ్డదిడ్డంగా పోసి మరింత ప్రమాదాలకు కారణమయ్యేలా పనులుంటున్నాయి. వాహనాల రాకపోకలతో గుంతలలో పోసిన మట్టి కొట్టుకుపోవడంతో దుమ్ము తేలి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

**నిరూపయోగంగా డక్ట్‌లు**
నగరంలోని 14.5 కిలోమీటర్ల పొడవునా ఆర్అండ్‌బీ రహదారులకు ఇరువైపులా రూ.కోట్లు ఖర్చు చేసి పైపులైన్లు, కేబుల్స్ వేసేందుకు ప్రణాళికలు చేశారు. వీటికి ఇళ్ల నుంచి వచ్చే పైపులు అడ్డు రావడంతో డక్ట్‌లు నిరుపయోగంగా మారగా, రోడ్డు మీద స్థలం లేకుండా పోయింది. పైగా చెత్తా చెదారం, నీరు నిలవడంతో దుర్గంధంగా మారింది. అధికారులు పరిశీలించి మరమ్మతులు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

**నడి రోడ్లపై పైపులైన్లు**
నగరవ్యాప్తంగా తాగునీటి పైపులైన్లు నడిరోడ్ల మీదుగా ఉన్నాయి. స్మార్ట్‌సిటీలో వేసిన కొత్త లైన్లు అలాగే ఉండగా.. పాత లైన్లు రోడ్ల మీదనే కనిపిస్తున్నాయి. జాయింట్ల లీకేజీలు పగిలిపోవడం, వాల్వులు చెడిపోవడం వంటి కారణాలతో బాగున్న రోడ్లు సైతం తవ్వే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే పలుచోట్ల తవ్వేశారు. 24 గంటల నీటి సరఫరాలో లీకేజీల పరిష్కారానికి హౌసింగ్ బోర్డు కాలనీలోనూ తవ్వకాలు చేపడుతున్నారు.

# అత్యవసర పనులపై దృష్టి

జగిత్యాల : ప్రాజెక్టుల పరిధిలో మరమ్మతు పనులను వచ్చే వానాకాలంలోపు పూర్తిచేయాలని నీటిపారుదలశాఖ నిర్ణయించింది. కాలువల మరమ్మతు, మొక్కల తొలగింపు, పంపుహౌస్‌ల నిర్వహణ, షట్టర్లు, క్రాస్ రెగ్యులేటర్ల మరమ్మతు తదితరాలను అత్యవసర పనులకింద చేపట్టనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 9 జిల్లాల్లో 200 పనులను తలపెట్టగా ఇందులో జగిత్యాల జిల్లాలో 45 వరకు పనులున్నాయి. ఏప్రిల్ 2న జోన్-2 ఆయకట్టుకు, ఏప్రిల్ 9న జోన్-1 ఆయకట్టుకు నీటితడుల ప్రణాళిక ముగిసిన వెంటనే పనులను ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నారు.
జిల్లాలో ప్రధానంగా శ్రీరామసాగర్ ప్రాజెక్టు ద్వారా 1,68,255 ఎకరాల ఆయకట్టు ఉండగా చెరువుల పరిధిలో 85,417 ఎకరాల ఆయకట్టు ఉంది. గత వానాకాలంలో భారీ వర్షాలతో కాలువల లైనింగ్, నిర్మాణాలతో పాటు చెరువులు కూడా దెబ్బతిన్నాయి. ఆయకట్టులో తగిన మరమ్మతు లేనందున చివరి ఆయకట్టుకు నీరుచేరటం గగనంగా మారటంతో ప్రస్తుతం అత్యవసర పనులను తలపెట్టి వర్షాల్లోపు పూర్తిచేయాలని నిర్ణయించారు. కొన్ని పనులను మాత్రమే ప్రస్తుతం చేపట్టనుండగా కాలువల్లో పూడికతొలగింపు ఉపాధిహామీ కూలీలతో చేయించాలా లేక నీటిపారుదలశాఖ నిధులతో చేపట్టాలా అనేది తేలాల్సి ఉంది. అలాగే రూ.136 కోట్లతో చేపట్టిన రోళ్లవాగు పనులను వేసవిలో పూర్తిచేసి వానాకాలంలో ఆయకట్టుకు నీరివ్వాల్సిఉంది.

**ప్రతిపాదనలు ఇవి..**
జిల్లాలో రూ.810.92 కోట్లతో పలు ఆయకట్టు స్థిరీకరణ పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపించగా రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించాల్సి ఉంది. ప్రధాన నిర్మాణాల ద్వారా 54,215 ఎకరాలు, ఎత్తిపోతల పథకాలు పూర్తితో 30,210 ఎకరాలకు నీరందుతుంది. వరదకాలువకు అనుబంధంగా రూ.763.31 కోట్లతో పలు పనులకు ప్రతిపాదించారు. ఇందులో కథలాపూర్ మండలం దుంపేట వద్ద పంపుహౌస్ నిర్మించి 52.30 కి.మీ వద్ద ఓటీద్వారా నీటిని తీసుకొని కలికోట సూరమ్మ చెరువు, లక్కాకుల, తుమ్మల చెరువులను నింపాలి. రుద్రంగి చెరువు ప్రధాన కుడికాలువ కొత్తపేట, మోత్కురావుపేటల వద్ద పంపుహౌస్‌లను నిర్మించి కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాల్లోని ఎల్లమ్మ తదితర చెరువులను నింపాలి.
వరదకాలువ 47.600 కి.మీ వద్ద ఎడమకాలువ పంపుహౌస్ నిర్మాణంతో 14ఆర్ కాలువ నింపితే కథలాపూర్, మెట్పల్లి మండలాలకు నీరందుతుంది. వరద కాలువ 67.500 కి.మీ వద్ద కుడికాలువ పంపుహౌస్ నిర్మాణంతో 15ఆర్‌కాలువను నింపటంద్వారా మేడిపల్లి, జగిత్యాల, మల్యాల మండలాలకు నీరందుతుంది. 59.500 కి.మీ వద్ద కుడికాలువ పంపుహౌస్ ద్వారా మేడిపల్లి, బీమారం, కథలాపూర్, కోరుట్ల మండలాలకు నీరు పారుతుంది. 76.22 కి.మీ మద్దుట్ల వద్ద పంపుహౌస్ నిర్మాణంతో కొత్తచెరువు నిండుతుంది. కొడిమ్యాల మండలంలో నిర్మాణాలు, వరదకాలువలో రంగాపూర్ వద్ద 3.5 కి.మీ లైనింగ్ పనులకు ప్రతిపాదనలు పంపించారు.జిల్లాలో 34 చెక్‌డ్యాంలను నిర్మించగా మరో 40 చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలి. జిల్లాలో 13 లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తిచేయాల్సిఉండగా 17 లిఫ్ట్ స్కీమ్‌లకు మరమ్మతు, 5 లిఫ్ట్ స్కీమ్‌ల పునరుద్ధరణ పనులు పూర్తిచేయాలి. వరదకాలువ నుంచి రూ.13.43 కోట్లతో చేపట్టిన కొండగట్టు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయాలి. కేంద్రం నుంచి పరిపాలన అనుమతులు వచ్చిన 6 చెరువుల పునరుద్ధరణతో పాటు మిషన్ కాకతీయ పథకం ద్వారా అసంపూర్తి చెరువుల పునరుద్ధరణకు రూ.121 కోట్ల వరకు నిధులు విడుదల చేయాలి.

# అవరోధాల వారధి

సుల్తానాబాద్: పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల సరిహద్దు ప్రాంతాల మధ్య దూరం తగ్గించేందుకు, రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు 2016లో ప్రభుత్వం రూ.47 కోట్ల వ్యయంతో సుల్తానాబాద్ మండలం నీరుకుళ్ల మానేరువాగుపై వంతెన నిర్మించింది. మిగిలిపోయిన పనుల కారణంగా వాహనదారులు ప్రయాస పడుతున్నారు.

**ఏడేళ్లైనా గతిలేని అప్రోచ్ రహదారులు**
సుల్తానాబాద్ మండలం నీరుకుళ్ల - మానకొండూర్ మండలం వేగురుపల్లి మధ్య మానేరుపై వంతెన నిర్మించారు. ఇరువైపులా అప్రోచ్ రోడ్లు లేక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వంతెన వద్ద ఇరువైపులా రహదారులు నిటారుగా ఉండడంతో సరకు వాహనాలు, కార్లు, ట్రాక్టర్ వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. అవతల వేగురుపల్లి వైపు అప్రోచ్ రహదారి సగం మాత్రమే పూర్తయి ప్రమాదకరంగా ఉంది. రాత్రిపూట వాహనదారులు గమనించక అందులో పడే ప్రమాదం ఉంది.

**30 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది!**
మానేరు వంతెన అవతల వేగురుపల్లి వైపు అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం సేకరించాల్సిన భూములు ప్రధాన సమస్యగా మారాయి. బహిరంగ మార్కెట్లో ఉన్న విలువకు తగ్గట్లు భూమి విలువ కడితేనే భూములు ఇచ్చేందుకు రైతులు సుముఖంగా ఉన్నారు. ఆ విలువల



ప్రకారం ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ఇప్పటికీ భూసేకరణ జరగలేదు.
సుల్తానాబాద్ మండలం వైపు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రైల్వే లోలెవల్ వంతెనలు అవరోధాలుగా ఉన్నాయి. రైల్వే ట్రాక్‌ల వద్ద హైలెవల్ వంతెనలు నిర్మించాల్సి ఉండగా ఆ దిశగా అడుగులు పడలేదు.
వంతెన పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సుమారుగా 30 కిలోమీటర్ల దూరభారం తగ్గనుంది. ఈ మార్గంగుండా పెద్దపల్లి వైపు రామగుండం, గోదావరిఖని, మంచిర్యాల వరకు రాకపోకలు కొనసాగిస్తుంటారు. అవతల వైపు మానకొండూర్, జమ్మికుంట, హుజూరాబాద్, వరంగల్ వరకు వెళ్తుంటారు. దీంతో కరీంనగర్ మీదుగా వెళ్లకుండా నేరుగా ఈ మార్గం గుండా వెళ్తే దాదాపు 30 కిలోమీటర్ల దూరం తగ్గనుంది.
భూముల సేకరణ నిధులపై గత ప్రభుత్వానికి నివేదించామని ఆర్అండ్‌బీ ఏఈ భాషా తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం చొరవ చూపి నిధులు కేటాయిస్తే పనులు ప్రారంభిస్తామన్నారు. వంతెనకు ఇరువైపులా 80 మీటర్ల మట్టిరోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు టెండర్లు పూర్తయ్యాయని.. పనులు ప్రారంభించి వంతెనను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.

# అడుగంటుతున్న భూగర్భ జలాలు

కరీంనగర్ : జిల్లాలో భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతోంది. నెల వ్యవధిలోనే సుమారు మీటరు లోతుకు భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. జనవరి నెలాఖరులోనే ఈ పరిస్థితి ఉంటే రాబోయే రెండు నెలల్లో మరింత లోతుకు వెళ్తుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. మార్చి నాటికి జిల్లాలోని పలు మండలాల్లో నాలుగు మీటర్ల వరకు పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. వ్యవసాయ, బోరుబావులు ఎండిపోయి పంటలు దెబ్బతినే అవకాశం ఉందని భూగర్భ జల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల ద్వారా పంటలకు నీరందిస్తుండడంతో ప్రస్తుతం పంటలు ఎండిపోయే పరిస్థితి లేదు. లేకపోతే ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటి పంటలు



ఎండిపోయే ప్రమాదం ఉండేది.

జిల్లాలోని 16 మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఫిజియోమీటర్లు ద్వారా ప్రతి నెలా నీటి మట్టాన్ని అధికారులు కొలుస్తున్నారు. 2024 జనవరిలో జిల్లా సగటు భూగర్భజల మట్టం 6.64 మీటర్లు ఉండగా, 2025లో 7.01 మీటర్లు ఉంది.

2024 డిసెంబరు నెలతో పోల్చితే గంగాధర, వీణవంక, కేశవపట్నం, మానకొండూరు మండలాల్లో నీటి మట్టం పైకి రాగా మిగతా అన్ని మండలాల్లో నీటి మట్టం తగ్గిపోయింది. సాగునీటి ప్రాజెక్టుల ఆధారంగా ఈ మండలాల్లో నీటిమట్టం పైకి వచ్చింది.

అందరూ వరిపంట వేసి బోర్లు, బావుల ద్వారా నీటిని తోడేస్తుండడంతో నీరు వేగంగా అడుగంటుతోందని భూగర్భ జలశాఖ అధికారులు చెబుతున్నారు. రాబోయే రెండు నెలల్లో మరింత పడిపోయే ప్రమాదం ఉండగా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

## చూపిన స్థలంలో నిర్మించాల్సిందే..!

నల్గొండ : పేదలకు ప్రభుత్వ సాయంతో నిర్మించే ఇళ్లకు తొలిసారి జియో ఫెన్సింగ్ చేయనున్నారు. దీనికోసం కృతిమ మేధ సాయంతో ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేశారు. ఇందిరమ్మ ఇళ్లతో దీన్ని అమల్లోకి తేనున్నారు. 2013లో రాష్ట్రంలో జియో ట్యాగింగ్ విధానాన్ని అమలు చేయడానికి అప్పటి ప్రభుత్వం ప్రతిపాదించినా అమలు కాలేదు. ఈసారి ఇందిరమ్మ ఇళ్లలో అక్రమాలు జరిగినట్లు తేలితే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులు ఇవ్వబోమని కేంద్రం తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో అక్రమాలకు అవకాశం లేకుండా రాష్ట్ర ప్రభుత్వంజియో ఫెన్సింగ్ విధానం అమలుకు నిర్ణయం తీసుకుంది.

**తేడా వస్తే రద్దు..**మొదటి విడతలో సొంతంగా ఇంటి జాగా ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇటీవల సర్వేచేసిన అధికారులు సొంత జాగా ఉన్న నిరుపేదలతో కూడిన ఎల్1 జాబితాను సిద్ధం చేశారు. ఇళ్లు కట్టే స్థలాన్ని సర్వే సమయంలోనే చూపారు. ఇప్పుడా స్థలం జియో ఫెన్సింగ్ చేయనున్నారు. ఆ స్థలంలోనే ఇంటి నిర్మాణానికి ముగ్గు పోయాల్సి ఉంటుంది. ముగ్గు పోసే రోజు గ్రామ కార్యదర్శికి, వార్డు అధికారికి సమాచారం ఇవ్వాలి. సర్వేలో చూపిన స్థలం అదేనా కాదా అని వారు ధ్రువీకరించాలి. తర్వాతే ప్రత్యేక యాప్‌లో స్థలం వివరాలు, అక్షాంశ, రేఖాంశాల వివరాలతో జియో ఫెన్సింగ్ చేస్తారు. తర్వాత తనిఖీకి వచ్చినప్పుడు ఆ స్థలం వద్ద నిల్చొని యాప్ ద్వారా పరిశీలిస్తారు. గతంలో ఇచ్చిన వివరాలు మ్యాచ్ అయితేనే ఫొటోలు, వివరాలు అప్‌లోడ్ అవుతాయి. ఏమాత్రం తప్పుడు సమాచారం ఉన్నా యాప్ తిరస్కరిస్తుంది.

**ఉమ్మడి జిల్లాకు 42 వేలు**

ఒక్కో నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల పరిధిలో 42 వేల ఇళ్లు మంజూరు కానున్నాయి. ఎమ్మెల్సీ కోడ్ జిల్లాలో అమల్లో ఉన్నందున ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టేందుకు ఇంకో 20 రోజులు పడుతుంది. ఇక ఎల్1 జాబితా ఇన్‌ఛార్జి మంత్రి అనుమతితో ఆమోదించనుండటంతో స్థానిక ఎమ్మెల్యేలే కీలక పాత్ర పోషించను న్నారు. **పాత ఇళ్లను చూపితే అంతే సంగతి**

గతంలో ఇందిరమ్మ ఇళ్లలో చాలా అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలున్నాయి. ఒక స్థలంలో చూపించి మరో స్థలంలో ఇళ్లు నిర్మించుకోవడం.. పాత ఇళ్లకే రంగులు వేసి కొత్తవిగా చూపించి బిల్లులు తీసుకోవడం.. బేస్‌మెంట్ లెవల్‌లో మొదటి బిల్లు ఉపాధి నిధుల నుంచి కావడంతో అందినకాడికి దోచుకున్నారు. ఇకపై అలాంటి వాటికి అవకాశం ఉండదు.

## చివరికి మేతగా..

భువనగిరి : 'మూగజీవాలు మేస్తున్నది గడ్డి కాదు.. ఎండిన వరి పొలం.. సంస్థాన్ నారాయణపురం మండలం తుంబాయితండాకు చెందిన జర్పుల రఘు రెండెకరాల్లో రూ.60 వేల పెట్టుబడి పెట్టి వరి సాగుచేశారు. బోరుబావి ఇంకిపోయింది. వేసిన పొలం ఎండిపోయి ంది. దిక్కుతోచని పరిస్థితుల్లో ఎండిన పొలాలన్నీ పశుగ్రాసం కోసం రూ.5 వేలకు విక్రయించారు. మార్చి రానేలేదు.. ఎండల తీవ్రత పెరుగుతోంది. భూగర్భ జలం శరవేగంగా అడుగంటుతోంది. బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. చేతికి అందాల్సిన పంటచేలు ఎండిపోతున్నాయి. పంటలు వేసిన రైతన్నల పరిస్థితి దైన్యంగా మారింది. యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 2,75,316 ఎకరాల్లో సాగు చేశారు. దాదాపు లక్ష ఎకరాలకు సాగునీటి గండం పొంచి ఉందని అధికారులు అంచనా వేస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత యాసంగి సీజన్‌తో పోల్చుకుంటే ఈసారి వరిసాగు 17,976 ఎకరాల్లో తగ్గింది. నారాయణపురం మండలంలో మరీ దైన్యస్థితి నెలకొంది. గతేడాది కంటే వరిసాగు విస్తీర్ణం సగానికి తగ్గగా.. వేసిన పంట కాస్తా నీళ్లు అందక ఎండిపోతోంది. తుంబాయి తండా, వాచ్యతండా, శేరిగూడెం, జనగామ, వాయిళ్లపల్లితో సహా పలుగ్రామాల్లో పంటలు ఎండిపోయియి. గుండాల మండలం బండ కొత్తపల్లి, వస్తకొండూరు, పెద్ద పాడిశాల గ్రామాల్లో, ఆత్మకూర్(ఎం) మండలంలో ఇదే పరిస్థితి నెలకొంది.గేదెలు మేపుతున్నా నాకున్న రెండున్నర ఎకరాల్లో యాసంగికి రూ.60 వేల పెట్టుబడితో వరి సాగుచేశా. పదిహేను రోజుల కిందట బోరు బావి పూర్తిగా వట్టిపో యింది. బావిలో ఊరిన నీరు 40 నిమిషాలు పంపు పోస్తుంది

# దోమల చెరువులు!



హైదరాబాద్: చేపలను సాగు చేసే తటాకాలను చేపల చెరువులని అంటారు. అలాగే.. దోమలతో నిండిన గ్రేటర్‌లోని జలవనరులను దోమల చెరువులుగా పిలవడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తటాకాల్లో గుర్రపుడెక్కను పెంచుతూ.. వాటి కింద దోమలను ఉత్పత్తి చేస్తున్నారని జీహెచ్‌ఎంసీ అధికారులపై విమర్శలొస్తున్నాయి. ఏడాదిగా బల్దియా యంత్రాంగం చెరువులను గాలికొదిలేసింది. గుర్రపుడెక్క తొలగింపు పనులు ఆపేసింది. మొక్కుబడిగా అంచుల్లోని మొక్కలను మాత్రమే తొలగిస్తోంది. దాంతో.. ఆర్.సి.పురం, మల్కాజిగిరి, బండ్లగూడ, మీరాలం, కాప్రా, తదితర చెరువుల్లో ఆ మొక్క వేళ్లూనుకుపోయింది. దోమలు భారీగా వృద్ధి చెందుతున్నాయి. సాయంత్రం కాగానే.. చుట్టుపక్కల జనావాసాలపై దాడి చేస్తున్నాయి. కాలనీవాసులకు నిద్ర పట్టనివ్వట్లేదు.

సుందరీకరణ పేరుతో రామచంద్రాపురం చెరువుపె రూ.కోట్లు వెచ్చించినా పరిస్థితిలో మార్పు లేదు. మురుగుతో నిండిన చెరువును గుర్రపుడెక్క కప్పేసింది.

మల్కాజిగిరి బండ చెరువులో 70శాతం గుర్రపుడెక్క పేరుకుపోయింది. కాప్రా పెద్దచెరువు మురుగు కూపంలా మారింది. రూ.కోట్లు వెచ్చించి, అభివృద్ధి పనులను మధ్యలో నిలిపేయడం, డెక్కను అలాగే వదిలేయడంతో పరిస్థితి దారుణంగా మారింది.

ఉప్పల్ నల్లచెరువు, సరూర్‌నగర్ పెద్దచెరువు, పాతబస్తీలోని మీరాలం, తదితర జలవనరుల్లోనూ భారీగా డెక్క విస్తరించింది. మైసమ్మచెరువు, కామునిచెరువు, హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ పక్కనున్న ముళ్లకత్వ చెరువులు పచ్చని మైదానాలుగా మారాయి.

**ఆరు నెలలుగా అదనపు బాధ్యతలు..**

ఆరోగ్య విభాగం అదనపు కమిషనర్‌కు చీఫ్ ఎంటమాలజిస్టు బాధ్యతను అప్పగించడంతో.. 6 నెలలుగా పూర్తి స్థాయి చీఫ్ ఎంటమాలజిస్టు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. జోన్లవారీగా దోమల నియంత్రణ చర్యలు, సమీక్షలు, తనిఖీలు, కొత్త విధానాలను అమలు చేయడంలో లోపాలు తలెత్తుతున్నాయి.

**నిలిచిన నివారణ చర్యలు..**

గుర్రపుడెక్కను తొలగించేందుకు కొన్నేళ్లుగా జీహెచ్‌ఎంసీ ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్లు(ఎఫ్‌టీసీ) అని పిలిచే యంత్రాలను ఉపయోగిస్తోంది. ఆరునెలల క్రితం వాటి పని కాలం పూర్తయింది. మళ్లీ టెండరు పిలిచేందుకు ఆసక్తి చూపట్లేదు.డ్రోన్లతో చెరువుల్లోని గుర్రపుడెక్కను అంతం చేసే పనులు కూడా నిలిచిపోయాయి. అవకతవకలు జరుగతున్నాయనే ఉద్దేశంతో.. ప్రక్రియను పూర్తిగా అటకెక్కించారు. ఇంటింటికీ తిరిగి దోమల మందును పిచికారి చేసే ఏఎల్ఓ(యాంటీ లార్వా ఆపరేషన్స్) కార్యక్రమాలు, ఫాగింగ్ మొక్కుబడిగా మారాయి.

# సంపదలో 'భాగ్య'నగరమే



హైదరాబాద్ : హైదరాబాద్ సంపదలో భాగ్యనగరమే. రాష్ట్రంలోని బ్యాంకు డిపాజిట్లలో సగంపైగా డిపాజిట్లు హైదరాబాద్‌లోనే ఉండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా 2024-2025 మొదటి త్రైమాసికంలో బ్యాంకుల్లో 7.69 లక్షల కోట్ల రూపాయల డిపాజిట్లు ఉండగా హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోనే రూ.5.18 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. ఇందులో హైదరాబాద్ జిల్లా వాటా రూ.4.62 లక్షల కోట్లు. తలసరి ఆదాయంలో రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో ఉండగా హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలు తర్వాతిస్థానంలో ఉన్నాయి. జిల్లా స్థూల ఉత్పత్తిలో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉండగా హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. రాష్ట్ర ప్రణాళికశాఖ సోమవారం తెలంగాణ రాష్ట్ర గణాంకాల సంకలనం (అట్లాస్)ను విడుదల చేసింది. జనాభా, ఆర్థిక, విద్య సహా వివిధ అంశాలకు సంబంధించిన గణాంకాలను విశ్లేషించింది. హైదరాబాద్ జిల్లా పరిధిలో తొలి త్రైమాసికంలో రూ.4.63 లక్షల కోట్ల రుణాలు అందజేశారు.

ఎస్సీలు, ఎస్టీలు అత్యల్పంగా ఉన్న జిల్లాల్లో హైదరాబాద్ మొదటి స్థానంలో ఉంది.

హైదరాబాద్ జనసాంద్రత 18,161. రాష్ట్ర సగటు జన సాంద్రత 312 మాత్రమే

కొత్త వాహనాలు: రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ అవుతున్న కొత్త వాహనాల్లో 53 శాతం వాహనాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోనే ఉన్నాయి. రాష్ట్రంలో 9,76,073 వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా ఇందులో 5,18,375 ఈ మూడు జిల్లాలోనే ఉన్నాయి.

తల్లులకు సప్లిమెంటరీ న్యూట్రిషన్ హైదరాబాద్‌లో 51.79 శాతం మందికి మాత్రమే అందింది. పిల్లలకు సప్లిమెంటరీ న్యూట్రిషన్ నమోదు చేసుకున్న వారిలో 60.3 శాతం మందికే అందింది.

జీహెచ్‌ఎంసీ పరిధిలో మొత్తం 9013 కిలోమీటర్ల రోడ్లు ఉండగా ఇందులో 2846 కిలోమీటర్లు బీటీ రోడ్లు, 6167 కిలోమీటర్లు సిమెంట్ కాంక్రీట్ రోడ్లు.

అత్యధిక డొమెస్టిక్ విద్యుత్ కనెక్షన్లు ఉన్న జిల్లా హైదరాబాద్. ఇందులో 79 వ్యవసాయ కనెక్షన్లు ఉండటం గమనార్హం.

రాష్ట్రంలో ఉన్న పాఠశాలల్లో అత్యధికంగా మొదటి మూడు స్థానాల్లో రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్, మేడ్చల్- మల్కాజిగిరి ఉన్నాయి.

రంగారెడ్డిలో 2907 స్కూళ్లు - విద్యార్థులు 7.70 లక్షలు

హైదరాబాద్‌లో 2865 - విద్యార్థులు 9.02 లక్షలు

మేడ్చల్-మల్కాజిగిరి 2070 - విద్యార్థులు 7.67 లక్షలు

# ఇష్టానుసారంగా చెత్త సేకరణ



కరీంనగర్ : జిల్లాలోని పురపాలికలు, నగరపాలక సంస్థల పరిధిలో పారిశుద్ధ్య పనులను మెరుగుపర్చేందుకు ఇంటింటా చెత్త సేకరణ చేస్తున్నారు. వార్డులు, డివిజన్ల వారీగా ప్రతీ ఇంటి నుంచి చెత్త తీసుకెళ్లేందుకు ప్రైవేటు కార్మికులతో స్వచ్ఛ ఆటోలను నడిపిస్తున్నారు. కొన్నింటిని నగర పాలక సంస్థనే డ్రైవర్ కం ఓనర్లుగా ఎంపిక చేసి ఆటోలు అందించింది. ఇక్కడి వరకు బాగానే ఉండగా, క్షేత్రస్థాయిలో వీరి పని తీరు తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. అప్పగించిన ఇళ్ల నుంచి ప్రతీ రోజు చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాల్సి ఉండగా కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

స్వచ్ఛ ఆటో కార్మికులు సమయపాలన పాటించడంలేదు. కొన్ని ప్రాంతాల్లో రోజు విడిచి రోజు వచ్చేందుకు నిర్ణయించగా దానిని కూడా అమలు చేయడంలేదు. వారంలో రెండు రోజులు దుమ్మాలు కొట్టడం, వాహనాలు పాడయ్యాయనే రకరకాల కారణాలు చెబుతున్నారు. ఉద్యోగులు, దుకాణాల్లో పని చేసేందుకు వెళ్లిపోయిన తర్వాత రావడం ఆటోలు వస్తుండటంతో చెత్త పేరుకుపోతుందని అంటున్నారు.

తడి, పొడి వేర్వేరుగా సేకరించాలని పలుమార్లు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాలు ఇస్తుండగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. డంపింగ్‌యార్డుకు చెత్త తగ్గించి, పొడి, తడి వేరు చేయాలనే లక్ష్యం సాధ్యం కావడంలేదు. తడి పూర్తిగా రీసోర్స్ పార్కుకు తరలించాలని కోరుతున్నా పట్టింపు లేకుండా పోతుంది.

గత ప్రభుత్వం స్వచ్ఛ ఆటోల విధానం ప్రవేశపెట్టింది. పురపాలికలు, నగరపాలికలతోనే ఆటోలు ఇప్పించి ఇంటింటా యూజర్ వసూలు చేసుకోవాలని నిర్ణయించింది. ఆటోలు రాని వారు కూడా సొంతంగా కొనుగోలు చేసి కార్పొరేటర్ల పైరవీలతో ఏర్పాటు చేసుకున్నారు. వీరికి 500 ఇళ్లను అప్పగించి చెత్త సేకరణ చేపట్టారు. ఒక్కో ఇంటికి రూ.50 తీసుకోవాల్సి ఉండగా, లెక్క లేకుండా నోటికి వచ్చినట్లు, రెండు, మూడు నెలలకు ఒకసారి పెంచుకుంటూ పోతున్నారు.

స్వచ్ఛ ఆటో కార్మికులు గత పదేళ్లుగా ఒకే డివిజన్‌లో పని చేస్తుండటంతో ఇంటి యజమానులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలున్నాయి. పైగా జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అంటే భయం లేకుండా పోయింది. తాజాగా వార్డు అధికారులు ఉండగా వీరి ఆదేశాలు కూడా బేఖాతారు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. వీరికీ డివిజన్లు మార్చితే చెత్త సేకరణలో మార్పునకు అవకాశముంది.

ఆదేశాలు జారీ చేశాం

స్వచ్ఛ ఆటో కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి చెత్త సేకరణపై పలు ఆదేశాలు జారీ చేశాం. ఫిర్యాదులు వస్తే వారినీ తొలగిస్తాం.

- కె.వేణుమాధవ్, సహాయ కమిషనర్, నగరపాలిక

## వ్యవసాయ బావులవైపు.. అన్నదాత చూపు

కోనరావుపేట: జిల్లాలో మూడేళ్లుగా ఆశించిన వర్షపాతం నమోదైంది. వనరుల్లో పుష్కలంగా నీరుండటంతో భూగర్భ జలాల లభ్యత ఆశాజనకంగా ఉంది. పలు ప్రాంతాల్లో రైతులు బోర్లు వేయడం కంటే బావుల తవ్వకంపైనే ఆసక్తి కనబరుస్తున్నారు. నూతన సాంకేతికతను సద్వినియోగం చేసుకుని యంత్రాల ద్వారా వ్యవసాయ బావులను ఏర్పాటు చేసుకుంటున్నారు. పూడికతీతకు సైతం యంత్రాలను వినియోగిస్తున్నారు.

అధిక విస్తీర్ణంలో వరి సాగు



రాజన్న సిరిసిల్ల జిల్లా మెట్ట ప్రాంతం. యాసంగిలో అత్యధిక విస్తీర్ణంలో వరిపంటను సాగుచేశారు. అన్ని రకాల పంటలు కొలుపుకొని మొత్తం 1,77,004.5 ఎకరాల్లో సాగవగా అందులో సుమారు 1.75 లక్షల ఎకరాల్లో వరిపంటను వేశారు. నీటి లభ్యత ఆధారంగా చెరువులు, కుంటలు, పంపుసెట్ల ద్వారా వరిసాగు చేస్తుంటారు. భూగర్భ జలాలు కొంతమేర ఆశాజనకంగా మారటంతో వరి సాగుచేసిన రైతులు దాదాపుగా బావులపైనే నీటికోసం ఆధారపడుతున్నారు. పలుచోట్ల కూరగాయలు, మొక్కజొన్న, ఉల్లి, నువ్వులు తదితర పంటలు సాగు చేస్తున్నారు. చాలాచోట్ల బోర్లు వేస్తున్నా ఆశించిన ఫలితం ఉండటం లేదు. వేసిన పంటలను కాపాడుకోవటానికి సాగునీటికోసం రైతులు బావుల తవ్వకంపైనే ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందుకోసం భారీ పొక్లెయిన్లను వినియోగిస్తున్నారు.

**సమయం, డబ్బులు ఆదా**

కూలీలతో వ్యవసాయ బావి తవ్వకం చేపట్టడంతో నెలల తరబడి సమయం వృథాతో పాటు అధిక వ్యయం అవుతోంది. భారీ పొక్లెయిన్‌తో బావుల తవ్వకం చేపడితే నూతన వ్యవసాయ బావికి రూ.1.10 లక్షల నుంచి రూ.1.30 లక్షల వరకు ఖర్చవుతోంది. వ్యవసాయ బావుల ద్వారా వచ్చే నీటి లభ్యత అధికంగా ఉంటోంది. పంటలను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయటానికి వీలవుతోంది.

- ఉప్పుల గంగయ్య రైతు సుద్దాల

## ఆయుష్షు పెంచేదెలా..!

నల్గొండ : అల్లోపతి మందులతో నయం కాని రోగాలతో పాటు, ఇతర రోగాల బారిన పడకుండా ఉండేందుకు ప్రకృతి సిద్ధమైన మాత్రలను వాడేవారు ఇటీవల పెరిగిపోతున్నారు. ఆయుష్షు విభాగంలోని ఆయుర్వేద, యునాని, హోమియో, యోగా పద్ధతుల ద్వారా సరఫరా అవుతున్న చికిత్సలు, మాత్రలను వాడుతున్నారు. అయితే వీరికి అనుగుణంగా జిల్లాలో వైద్య సేవలు అందడం లేదు. జిల్లాలోని ఆయుష్షు విభాగం అంధకారంలో కన్పిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 21 డిస్పెన్సరీల ద్వారా సేవలు అందించడానికి ఏర్పాట్లు చేశారు. వాటిలో ఆయుర్వేద-8, హోమియో-6, యునాని-7 ఉన్నాయి. వీటితో పాటు 21 ప్రాంతాల్లో యోగా కేంద్రాలు ఏర్పాటు చేసి 40 మంది యోగా శిక్షకులను ఎంపిక చేశారు. అవగాహన లేకపోవడంతో ఎక్కడా యోగా కేంద్రాలు పూర్తి స్థాయిలో కొనసాగడం లేదు.

**సిబ్బంది ఇలా..**

జిల్లాలో ప్రస్తుతం ఉన్న 21 డిస్పెన్సరీల్లో 11 మంది వైద్యాధికారులు అందుబాటులో ఉన్నారు. మరో పది ప్రాంతాల్లో వైద్యులు లేక ఖాళీ కుర్చీలు కన్పిస్తున్నాయి. ఎనిమిది మంది ఫార్మసిస్టులు మాత్రమే అందుబాటులో ఉండగా 13 ప్రాంతాల్లో ఖాళీగా ఉన్నాయి. ఇందుర్తి, మాడ్గులపల్లి ప్రాంతాల్లో ఉన్న డిస్పెన్సరీలు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి.

**ఏదీ సమయపాలన..!**

ఆయుష్షు పరిధిలోని డిస్పెన్సరీలు ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకు రోగులకు అందుబాటులో ఉండాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న డిస్పెన్సరీలు ఉదయం 10 గంటలకు తెరుచుకొని మధ్యాహ్నం 3 గంటలకే మూసి వేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ఆయుర్వేద, యునాని, హోమియో డిస్పెన్సరీల్లో కింది స్థాయి సిబ్బంది మాత్రమే 12 గంటల వరకు కన్పిస్తున్నారు. వైద్యులు వారానికి రెండు, మూడు రోజులు వస్తున్నారని అది కూడా సమయపాలన పాటించడం లేదని రోగులు వాపోతున్నారు. ఇతర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న డిస్పెన్సరీల పరిస్థితి మరీ దయనీయంగా మారింది.

**సమాచారం తెలుసుకుంటాం**నేను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. జిల్లాకు సంబంధించిన పూర్తి వివరాలు అంతగా తెలియదు. కొద్ది రోజుల్లో పూర్తి వివరాలు తెలుసుకొని అన్నిరకాల సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తాను. సిబ్బంది సమయపాలన పాటించాల్సిందే. డా.నర్సింహారావు, ఆయుష్షు జిల్లా ఇన్‌ఛార్జి

## హుజూర్‌నగర్ కేంద్రంగా నాసిరకం దందా

మేళ్లచెరువు : హుజూర్‌నగర్, మిర్యాలగూడ కేంద్రంగా నాసిరకం మందుల రాకెట్ నడుస్తుందా.. అంటే అవుననే పరిస్థితి కన్పిస్తోంది. ఈ పట్టణాల నుంచి వివిధ ప్రాంతాలకు ప్రముఖ కంపెనీల పేరుతో నాసిరకం మందులను రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. తాజాగా విజిలెన్స్ అధికారులు జరిపిన తనిఖీలతో ఈ దందా తేటతెల్లం అవుతోంది. విజిలెన్స్ అధికారుల సమాచారం మేరకు హుజూర్‌నగర్, మేళ్లచెరువులలో సోమవారం దాడులు నిర్వహించి ఓ ప్రముఖ కంపెనీ పేరుతో దిగుమతైన పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో సగం వరకు నాసిరకం ఉన్నట్టు కంపెనీ ప్రతినిధులు చెబుతున్న వివరాలను బట్టి తెలుస్తోంది.

దిగుమతి చేసుకుంటున్నారిలా... ప్రముఖ కంపెనీల పేరుతో ఇక్కడ కొందరు వ్యాపారులు పురుగు మందులను ఒక ఆర్డర్ పెడతారు. ఇవి రాగానే వాటిని విప్పి బాక్స్‌లో ఉన్న కేజీ ప్యాకెట్‌లను కొన్నింటిని తీసి వాటి స్థానంలో నకిలీవి పెట్టి తిరిగి వాటిని రిటైల్ దుకాణదారులకు పంపిస్తూ అమ్మకాలు చేస్తున్నారు. సోమవారం పట్టుబడిన వాటిలో హరియాణాలోని ఒక సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో డీలర్ కొనుగోలు చేసినట్టు ఉంది. ఇలా.. రకరకాల చిరునామాలలో కొనుగోలు చేసినట్టుగా.. నకిలీ మందులు నింపిన ఆ ప్యాకెట్ల బాక్సులను నేరుగా దుకాణం ఉన్న ప్రాంతానికి కాకుండా మరో ప్రాంతంలోని దిగుమతి కొరియర్ కేంద్రాలకు తెప్పించుకుంటున్నారు. తిరిగి వాటిని యథేచ్ఛగా తమ దుకాణాలకు, రైతులకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఇందులో కీలకంగా హుజూర్‌నగర్‌కు చెందిన ఒక డీలర్ ఉన్నట్లు సమాచారం.



# ఏపీలో కొత్త ఆవిష్కరణలకు కృషి: బిల్ గేట్స్

అమరావతి: ఏపీ ప్రభుత్వంతో ఒప్పందాలపై మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. రాష్ట్రంలో ఆరోగ్యం, వ్యవసాయం, విద్యా రంగాల్లో కొత్త ఆవిష్కరణలకు కృషి చేస్తామన్నారు. భవిష్యత్తులో మరిన్ని మెరుగైన సేవలు అందించాలని ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం దిల్లీలో బిల్ గేట్స్‌తో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించి గేట్స్ ఫౌండేషన్‌తో పలు ఒప్పందాలు చేసుకున్నారు.




# వైకాపా ఎమ్మెల్యేలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు అసహనం

అమరావతి: వైకాపాకు చెందిన ఎమ్మెల్యేలు శాసనసభకు రాకుండా సంతకాలు చేస్తుండటంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వైకాపా ఎమ్మెల్యేలు సభకు హాజరవడం మీరెవరైనా చూశారా? అంటూ సభ్యులను స్పీకర్ ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన సభ్యులు సభకు సగౌరవంగా హాజరుకావాల్సి ఉందన్నారు. వైకాపా సభ్యులు ఎవరికీ కనపడకుండా దొంగచాటుగా వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేయాల్సిన పనేముందని అసహనం వ్యక్తం చేశారు. అలా వచ్చి వెళ్లడం వారి గౌరవాన్ని పెంచదన్నారు. వైకాపా సభ్యులు బాలనాగిరెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, మత్స్యలింగం, విరూపాక్ష, విశ్వేశ్వరరాజు, ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, దాసరి సుధ తదితరులు సంతకాలు చేసినట్లు తేలిందని స్పీకర్ చెప్పారు. గవర్నర్ ప్రసంగం తర్వాత వీరెవరూ సభకు హాజరు కాలేదన్నారు. వేర్వేరు తేదీల్లో వీరు రిజిస్టర్‌లో సంతకాలు చేసినట్టు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. హాజరుపట్టిలో వారి సంతకాలు ఉన్నా వాళ్లు సభకు వచ్చినట్టు స్పీకర్‌గా తాను గుర్తించలేదన్నారు. ఓటేసి గెలిపించిన ప్రజలకు తలవంపులు తేవొద్దంటూ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు.

# ఆ గుండె ధైర్యం ఉన్న వ్యక్తి మందకృష్ణ: పవన్ కల్యాణ్



అమరావతి: ఎస్సీ వర్గీకరణ ఈ స్థాయి వరకు వచ్చిందంటే మందకృష్ణ మాదిగ, ఏపీ సీఎం చంద్రబాబు కారణమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై ఆయన మాట్లాడారు. మాదిగ అని చెప్పగలిగే గుండె ధైర్యం కలిగిన వ్యక్తి మందకృష్ణ. ఆ కులానికి వన్నె తెచ్చిన ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చెప్పారు. "ఎస్సీ వర్గీకరణపై చాలా చర్చలు జరిగాయి. గుర్తింపు లేని కులాలపైనా విస్తృతంగా చర్చలు జరిగాయి. సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టి రాజీవ్ రంజన్ మిశ్రాతో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారు. కమిషన్ ఇచ్చిన నివేదిక చాలా అద్భుతంగా ఉంది. ఇది అందరికీ మేలు చేస్తుందని ఆశిస్తున్నా"అని పవన్ అన్నారు.




**గుంటూరు: ఎలాంటి షరతులు లేకుండానే తెలుగుదేశం పార్టీలో చేరతానని ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన మర్రి రాజశేఖర్ తెలిపారు. గుంటూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "వైకాపాలో అవమానాలు భరించలేక ఎమ్మెల్సీ పదవీ కాలం ఇంకా నాలుగేళ్లు ఉన్నప్పటికీ రాజీనామా చేశా. వైకాపాకు రాజీనామా చేసిన తర్వాతే మరొక పార్టీలోకి వెళ్తున్నా. పార్టీ నాయకుడు ఎప్పుడూ తన హామీని నిలబెట్టుకోలేదు. పార్టీకి అవసరం లేదన్నట్టుగా వ్యవహరించారు. 14 ఏళ్లు పనిచేసిన పార్టీలో గౌరవం మాత్రమే కోరా" అని వివరించారు.**

# కొల్లేరు సమస్య జటిలం కావడానికి రాజకీయాలే కారణం: జనసేన

అమరావతి: కొల్లేరు విధ్వంసంపై జనసేన ప్రకటన విడుదల చేసింది. కొల్లేరు సమస్య జటిలం కావడానికి రాజకీయాలే కారణమని అందులో పేర్కొంది. "ఆపరేషన్ కొల్లేరు పేరుతో 2006లో వైఎస్ ప్రభుత్వం నాటు బాంబులతో చెరువుల గట్లు పేల్చేసింది. పర్యావరణాన్ని పరిరక్షించే సిద్ధాంతం మాది. కొల్లేరుపై ఆధారపడిన వారి ఉపాధిని, పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వానిది. సమస్యలకు మూలకారణాలను అన్వేషించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది.

సమస్యపై కొల్లేరు వాసులతో వివిధ సందర్భాల్లో మా పార్టీ చర్చించింది. ఉప ముఖ్యమంత్రి పవన్ సమతుల్యమైన పరిష్కారం దిశగా చర్చిస్తున్నారు. అధికారులు, నిపుణులు, ప్రాంతవాసులతో ఆయన భేటీ అయ్యారు. ఎన్నో సంక్లిష్ట సమస్యలను పరిష్కరించిన అనుభవం సీఎం చంద్రబాబుకు (%జష్ఠ్రుఅంతీఖఎఖఎబ%) ఉంది" అని ప్రకటనలో జనసేన పేర్కొంది.




భారత్ విధించే టారిఫ్‌లు తగ్గింపు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వరం మారింది. న్యూదిల్లీ సుంకాలను తగ్గించే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశాభావం వ్యక్తంచేశారు. తాజాగా ఆయన బ్రీట్‌బాట్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో ఓ సందర్భంలో ఆయన మాట్లాడుతూ భారత్ పన్నులు తగ్గించేందుకు అంగీకరించిందని.. అదంతా తన ఘనతే అని చెప్పుకొచ్చారు. తాజాగా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "భారత్ టారిఫ్‌లను గణనీయంగా తగ్గించే అవకాశం ఉన్నట్లు నమ్ముతున్నాను. కానీ, ఏప్రిల్ 2 నుంచి వారెంత విధిస్తే.. మేమూ అంతే విధిస్తాం" అని ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఆయన ఏప్రిల్ 2ను లిబరేషన్‌డేగా అభివర్ణిస్తుండటం గమనార్హం. వాణిజ్య యుద్ధాల నేపథ్యంలో ఇరుదేశాల మధ్య పన్నుల విధానంలో కీలక మార్పులు చోటుచేసుకొంటాయన్న అంచనాల నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు వెలువడటం గమనార్హం. ఒకవేళ పన్నుల తగ్గింపు నిర్ణయం వెలువడితే అది భారత ఆర్థికవ్యవస్థపై, వాణిజ్య మిగులు, ఫైనాన్షియల్ మార్కెట్లపై ప్రభావం చూపించనుంది. ముఖ్యంగా వ్యవసాయోత్పత్తులు, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్, రంగాలు భారీ పోటీని ఎదుర్కోనున్నాయి. దీంతోపాటు భారత ప్రభుత్వానికి పన్నులు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న విషయం తెలిసిందే. ట్రంప్ భారత్‌లో పన్నుల విధానాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. గతంలో కూడా ఆయన మాట్లాడుతూ "భారత్ టారిఫ్ కింగ్" అని వ్యాఖ్యానించారు. అంతేకాదు.. భారత్–అమెరికా వాణిజ్య లోటు 100 బిలియన్ డాలర్లు ఉన్న విషయాన్ని కూడా ఆయన ఎత్తిచూపారు. మరోవైపు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ మాత్రం ఇటీవల మాట్లాడుతూ.. "మీరు నమ్మినా, నమ్మకపోయినా.. సుంకాలు, ఆంక్షలు అనేవి వాస్తవ అంశాలు. దేశాలు వాటిని అమలు చేస్తున్నాయి. నిజానికి గత దశాబ్దాన్ని మీరు గమనించినట్లయితే.. సామర్థ్యమేదైనా గొప్ప ఆయుధీకరణను చూశాం. ఆర్థిక ప్రవాహం, ఇంధన సరఫరా, సాంకేతికత బదిలీ పెరగడం చూశాం. ఇదే ప్రపంచంలో జరుగుతున్న వాస్తవం. ఓ దేశం సమగ్ర జాతీయశక్తిగా ఎదిగే పోరాటానికి వ్యాపార, వాణిజ్య సంబంధాలు ముఖ్యమైన సహకారాన్ని అందిస్తాయి. అందుకే ఆ వ్యాపారం కోసం దేశాలు పోటీపడుతున్నాయి." అని వెల్లడించారు.




వాషింగ్టన్: అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటినుంచి వలసల అంశంపై ప్రత్యేక దృష్టిసారించారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఈ క్రమంలోనే తాజాగా వీసా జారీ ప్రక్రియ కోసం సరికొత్త వ్యవస్థను అమలుచేసేందుకు సిద్ధమయ్యారు. మార్చి 20 (అమెరికా కాలమానం ప్రకారం) నుంచి వీసా దరఖాస్తులను పరిశీలించే ఫారిన్ లేబర్ యాక్సెస్ గేట్‌వే వ్యవస్థలో పాత రికార్డులు, దరఖాస్తులను తొలగించనుంది. దీంతో హెచ్–1బీ వీసా ప్రోగ్రామ్‌లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. తాజా ఆదేశాల ప్రకారం.. మార్చి 20 నుంచి ఐదేళ్ల కంటే పాతవైన అన్ని రికార్డులను సిస్టమ్ నుంచి తొలగించనున్నారు.

అంటే.. ఉదాహరణకు ఓ దరఖాస్తుకు సంబంధించిన 2020 మార్చి 22న తుది నిర్ణయం వెలువడి ఉంటే.. ఈ ఏడాది మార్చి 22న దాని రికార్డులను తొలగిస్తారు. ఉద్యోగులకు సంబంధించి ఐదు సంవత్సరాల కంటే పాతవైన వీసాల రికార్డులన్నింటినీ మార్చి 19లోగా డౌన్‌లోడ్ చేసి పెట్టుకోవాలని ఆయా సంస్థలను ఇప్పటికే ఆదేశించారు. లేదంటే ఆ రికార్డులను కోల్పోవాల్సి ఉంటుందని పేర్కొంది. హెచ్–1బీ సహా అన్ని తాత్కాలిక లేబర్ కండిషన్ అప్లికేషన్స్, శాశ్వత లేబర్ సర్టిఫికేట్ అప్లికేషన్లపై ఈ తొలగింపు ప్రభావం పడనుందని ఆఫీస్ ఆఫ్ ఫారిన్ లేబర్ సర్టిఫికేషన్ విభాగం నోటీసులు జారీ చేసింది. త్వరలోనే వీసాల జారీ కోసం యూఎస్ ఇమిగ్రేషన్ విభాగం కొత్త దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించనుంది. దరఖాస్తుదారులందరికీ మరింత పారదర్శకంగా సేవలందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ సర్కారు వెల్లడించింది. అందుకే, పాత రికార్డులను తొలగిస్తున్నట్లు తెలిపింది. ఈ ఏడాది నుంచి హెచ్–1బీ వీసాల జారీలో అమెరికా కొత్త విధానాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇకపై, ఒక లబ్ధిదారు బహుళ దరఖాస్తులు చేసుకున్నా.. ఒకే అప్లికేషన్‌గా పరిగణించనున్నారు. రిజిస్ట్రేషన్ల సంఖ్యతో సంబంధం లేకుండా.. దరఖాస్తుదారులందరికీ సమాన అవకాశాలు కల్పించడం కోసం ఈ 'కేంద్రీకృత–ఎంపిక ప్రక్రియ' నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం వెల్లడించింది. ఒకే లబ్ధిదారుని తరఫున బహుళ రిజిస్ట్రేషన్లు సమర్పించి కొన్ని సంస్థలు లాటరీ విధానంలో అనుచిత ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిస్తున్నాయి. దీంతో వీటిని అరికట్టేందుకు తాజా నిబంధనలను తీసుకొచ్చారు.

# విశాఖలో వైసీపీకి బిగ్ షాక్.. ఒకే సారి 9 మంది రాజీనామా!




ఏపీలో వైసీపీకి వరుస షాక్ లు తగులుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆ పార్టీని వీడుతున్న నేతల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో వైసీపీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ స్థాయి నేతలు సైతం రాజీనామా బాట పడుతున్నారు. రెండు రోజుల క్రితం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కావటి మనోహర్ నాయుడు రాజీనామా చేయగా, తాజాగా విశాఖ కార్పొరేషన్ కు చెందిన 9 కార్పొరేటర్లు టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు రాజధాని అమరావతికి చేరుకున్నారు. దీంతో విశాఖ నగర రాజకీయం వేడెక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో రాజకీయ మారుతోంది. విశాఖ, విజయవాడ, తిరుపతి, కర్నూలు, ఒంగోలు, తిరుపతి ఇలా రాష్ట్రంలో దాదాపు 11 కార్పొరేషన్లు ఉండగా, ఒక్కచోట కూడా టీడీపీ అధికారంలో లేదు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో 90 శాతం విజయం సాధించి అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను వైసీపీయే చేజిక్కించుకుంది. అయితే రాష్ట్రంలో అధికారం చేతులు మారిన తర్వాత స్థానిక పాలనలోనూ మార్పు వస్తోంది. ఇటీవల నిర్వహించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మేయర్, డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. నెల్లూరు, ఏలూరు, తిరుపతి కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్లుగా టీడీపీ నేతలు పదవులు దక్కించుకున్నారు. ఏలూరులో వైసీపీ దాదాపు ఖాళీ అవ్వగా, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, విశాఖ కార్పొరేషన్లలోనూ టీడీపీ బలం పెరిగింది. వైసీపీ నుంచి గెలిచిన కార్పొరేటర్లు టీడీపీ కూటమి గూటికి చేరుతుండటంతో వైసీపీ తరఫున ఎన్నికైన మేయర్లు పదవులను వీడాల్సివస్తోంది. గుంటూరులో జరిగిన స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో మేయర్ తన పదవికి రాజీనామా చేశారు. అదేవిధంగా తాజాగా విశాఖలో 9 మంది కార్పొరేటర్లు పసుపు కండువాలు కప్పుకోడానికి సిద్ధమవడంతో నేడో రేపో అక్కడి మేయర్ పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం ఉందంటున్నారు. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్లో మొత్తం 98 డివిజన్లు ఉండగా, వైసీపీకి మెజార్టీ దక్కింది. అయితే ప్రస్తుతం వైసీపీ నుంచి వలసలు పెరిగిపోవడంతో టీడీపీ బలం పుంజుకుంది. గత కార్పొరేషన్ ఎన్నికల్లో విశాఖలో టీడీపీకి 29 డివిజన్లు దక్కాయి. ఎన్నికల అనంతరం 12 మంది టీడీపీ కండువా కఇప్పుకోగా, తాజాగా మరో 9 మంది పార్టీ మారనున్నారని అంటున్నారు. అదేవిధంగా జనసేనకు ముగ్గురు ఉండగా, ఎన్నికల అనంతరం ఆ పార్టీలో ఏడుగురు చేరారు. బీజేపీ నుంచి ఒకరు గెలవగా, ఎన్నిక తర్వాత మరొకరు గెలిచారు. దీంతో జీవీఎంసీలో కూటమి బలం 62కు చేరింది. దీంతో మేయర్ పై అవిశ్వాసం పెట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. విశాఖలో గతంలో జరిగిన స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల్లో కూడా మొత్తం 10 కౌన్సిల్లను టీడీపీ గెలుచుకోవడం గమనార్హం.

# విశాఖపట్నం, తిరుపతిలో సినీ పరిశ్రమ అభివృద్ధికి చర్యలు: మంత్రి దుర్గేశ్

అమరావతి: విశాఖపట్నం, తిరుపతిలో సినీ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి త్వరలో కొత్త పాలసీ తీసుకురాబోతున్నట్టు చెప్పారు. సినీ ప్రముఖులతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. విశాఖపట్నంలో సినీపరిశ్రమ అభివృద్ధి, గిరిజన ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధిపై మండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. విశాఖలో చలన చిత్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్న మంత్రి... కూటమి ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సినీ పరిశ్రమకు చెందిన పెద్దలతో చర్చించారని, హైదరాబాద్ తరహాలో స్టూడియోలను రాష్ట్రంలో ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఏపీ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అద్భుతమైన లొకేషన్లు ఉన్నాయని, స్టూడియోలు నిర్మిస్తే ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని నిర్మాతలను చెప్పినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం ద్వారా లేక పీపీపీ మోడ్‌లో స్టూడియోల నిర్మాణానికి సహకారం అందిస్తామన్నారు. విశాఖలో రామానాయుడు స్టూడియోకు గతంలో 34 ఎకరాలు కేటాయించగా.. గత ప్రభుత్వం ఇందులో 15 ఎకరాలు లేఅవుట్లు వేసి ఇతర అవసరాలకు మళ్లించిందన్నారు. రాబోయే రోజుల్లో 34 ఎకరాలను సినీ పరిశ్రమకు వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన ప్రాంతాలకు సంబంధించి 1/70 చట్టాన్ని సవరించే ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, గిరిజనుల భాగస్వామ్యంతో పర్యాటకం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

## నభా నటేశ్.. పొట్టి నిక్కరులో కిర్రాక్ లుక్స్

టాలీవుడ్ లో తనదైన స్టైల్ తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నభా నటేశ్, తాజాగా తన గ్లామరస్ లుక్స్ తో మరోసారి సోషల్ మీడియాలో సంచలనం రేపింది. తెలుగులో తనకంటూ ఓ ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్‌ను ఏర్పరచుకున్న నభా, గ్లామర్ పరంగా ఎప్పటికప్పుడు కొత్త ట్రెండ్స్‌ను సెట్ చేస్తూ ముందుకు సాగుతోంది. 'ఇస్మార్ట్ శంకర్' మూవీతో స్టార్ స్టేటస్ అందుకున్న ఈ అందాల భామ, ఇటీవల కొన్ని గ్లామరస్ ఫోటోలు షేర్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఫిదా చేసేస్తోంది. తాజా ఫోటోషూట్ లో నభా నటేశ్ వైట్ క్రాప్ టాప్, లూస్ షార్ట్స్ లో స్టన్నింగ్ లుక్‌తో దర్శనమిచ్చింది. కిచెన్ వాతావరణంలో తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ తో ఫోటోషూట్ చేయించుకుంది. చేతిలో కోల్డ్ డ్రింక్, టేబుల్ మీద పిజ్జా ఉండటంతో ఫోటోలకు ప్రత్యేకమైన అర్థం వచ్చి పడింది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, నభా స్టైల్ సెన్స్ గురించి ఫ్యాన్స్ పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. ఆమె ఈ



క్యాజువల్ లుక్ లోనూ ఎంతో స్టన్నింగ్ గా కనిపించడం గమనార్హం. ఈ ఫోటోషూట్ లో ఆమె గ్లామర్ హైలైట్ అవ్వడమే కాకుండా, తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో మరింత మేజిక్ క్రియేట్ చేసింది. కొందరు నెటిజన్లు "నభా ఈజ్ బ్యాక్" అంటూ కామెంట్స్ పెడుతుండగా, మరికొందరు ఆమె మరిన్ని టాలీవుడ్ ప్రాజెక్ట్స్ చేయాలని కోరుతున్నారు. గతంలో నభా 'ఇస్మార్ట్ శంకర్' తో సంచలనం రేపినా, అనంతరం అనుకున్నంత పెద్ద హిట్లు అందుకోలేకపోయింది. అయితే తన గ్లామర్ గేమ్ లో ఎప్పటికప్పుడు కొత్త లెవల్స్ కు వెళ్లి ట్రెండ్ సెట్టర్ గా మారుతోంది. నభా నటేశ్ ప్రస్తుతం స్వయంభూ మూవీతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. అలాగే ఒక స్టార్ సరసన నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు చిత్రాలు నభా కెరీర్ కి మళ్లీ మంచి ఊపును తీసుకురావొచ్చని అభిమానులు భావిస్తున్నారు. సోషల్ మీడియాలో తన లుక్స్ తో నిత్యం ట్రెండింగ్ లో ఉండే నభా, మరిన్ని ఆసక్తికరమైన ప్రాజెక్ట్స్ లో నటిస్తుందా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. మొత్తానికి, నభా నటేశ్ తాజా ఫోటోషూట్ గ్లామర్, స్టైల్ మరియు ఎక్స్‌ప్రెషన్స్ పరంగా మైండ్ బ్లోయింగ్ గా ఉందనే చెప్పాలి.

## ప్రొడ్యూసర్ నిహారిక సెకండ్ మూవీ కన్ఫర్మ్ అయినట్టేనా

మెగా తనయ, నాగ బాబు కూతురు నిహారిక ముందు యాంకర్ గా ఇండస్ట్రీకి పరిచయమైంది. తర్వాత ముద్దపప్పు ఆవకాయ వెబ్ సిరీస్ తో నటిగా, నిర్మాతగా మారి మంచి పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత ఒక మనసు సినిమాతో హీరోయిన్ గా గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. కానీ ఒక మనసు సినిమా అనుకున్న స్థాయిలో ఆడలేదు. తర్వాత కూడా నిహారిక హీరోయిన్ గా పలు సినిమాలు చేసింది కానీ అవేమీ తనను స్టార్ హీరోయిన్ గా నిలబెట్టలేకపోయాయి. ప్రస్తుతం నటిగా సినిమాలు చేస్తూనే మరోవైపు నిర్మాతగా కూడా సినిమాలు నిర్మిస్తోంది. ముద్దపప్పు ఆవకాయ వెబ్ సిరీస్ ను నిర్మించిన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ లోనే నిహారిక సినిమాలు, సిరీస్‌లు నిర్మిస్తోంది. ఇప్పటికే పలు సిరీస్‌లు నిర్మించిన మెగా డాటర్ నిహారిక గతేడాది కమిటీ కుర్రోళ్లు సినిమాతో పూర్తి స్థాయి సినీ నిర్మాతగా మారి భారీ హిట్ అందుకుంది. ఆ సినిమాతో నిహారిక ఇండస్ట్రీకి చాలా మంది కొత్త టాలెంట్ ను పరిచయం చేసింది. చిన్న సినిమాగా వచ్చిన కమిటీ



కుర్రోళ్లు రూ.50 కోట్లు కలెక్ట్ చేసి భారీ సక్సెస్ ను అందుకుంది. ఇప్పుడు నిహారిక నిర్మాతగా రెండో సినిమా చేయడానికి రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. ఆల్రెడీ దానికి సంబంధించిన బ్యాక్ గ్రౌండ్ వర్క్ మొదలైందని, పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ప్రాజెక్టుల్లో ఎంతోకాలంగా అసోసియేట్ గా ఉన్న మానస శర్మ దర్శకత్వంలో నిహారిక రెండో సినిమాను నిర్మించనుందని ఫిల్మ్ నగర్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. మానస శర్మ ఆల్రెడీ ఇదే బ్యానర్ లో క్రియేటివ్ డైరెక్టర్ గా జీ5 కోసం ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ అనే వెబ్ సిరీస్ తో పాటూ డైరెక్టర్ గా సోనీ లివ్ కోసం బెంచ్ లైఫ్ అనే సిరీస్ చేశారు.ఇప్పుడు మానస శర్మ, పింక్ ఎలిఫెంట్స్ బ్యానర్ లో తన మూడవ ప్రాజెక్టును చేయనున్నారు. అయితే ఈ సారి మానస చేస్తుంది వెబ్ సిరీస్ కాదు సినిమానే. నిర్మాతగా నిహారికకు ఇది రెండో సినిమా. మొదటి సినిమాను ఎంతో జాగ్రత్తగా ప్లాన్ చేసుకుని షూటింగ్ నుంచి ప్రమోషన్స్, రిలీజ్ వరకు అన్నీ తానై చూసుకున్న నిహారిక ఈ రెండో ప్రాజెక్టు విషయంలో ఇంకెన్ని జాగ్రత్తలు తీసుకుంటుందో చూడాలి.




## రాబిన్ హుడ్ కోసం ఎవరిని తెస్తున్నారు..?




నితిన్ రాబిన్ హుడ్ సినిమా మార్చి 28న రిలీజ్ కాబోతుంది. వెంకీ కుడుముల డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమా ఫన్ ఫిల్డ్ ఎంటర్టైనర్ గా రాబోతుంది. రాబిన్ హుడ్ ఒక థీఫ్ కథతో ఈ సినిమా వస్తుందని తెలుస్తుంది. రాబిన్ హుడ్ సినిమాలో నితిన్ సరసన శ్రీలీల హీరోయిన్ గా నటిస్తుంది. సినిమాకు జీవీ ప్రకాష్ మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమా నుంచి ఇప్పటికే రిలీజైన సాంగ్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. భీష్మ తో వెంకీ కుడుముల, నితిన్ మంచి సక్సెస్ అందుకోగా మళ్లీ అదే కాంబోలో వస్తున్న ఈ సినిమా పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈమధ్య సినిమా ప్రమోషన్స్ విషయంలో మేకర్స్ డిఫరెంట్ అటెంప్ట్స్ చేస్తున్నారు. అందుకే రాబిన్ హుడ్ కోసం కూడా వెంకీ నితిన్ ఇద్దరు రకరకాల ప్రమోషనల్ ప్రోగ్రామ్స్ చేస్తున్నారు. ఈ యాక్టివిటీస్ కూడా సినిమాను ప్రేక్షకుల్లోకి తీసుకెళ్తున్నాయి. ఐతే మార్చి 28న రిలీజ్ కాబోతున్న రాబిన్ హుడ్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ త్వరలో జరగబోతుంది. వెన్యూ, డేట్ ఇంకా ఫిక్స్ చేయలేదు కానీ నితిన్ రాబిన్ హుడ్ కోసం వచ్చే గెస్ట్ గురించి అందరు మాట్లాడుకుంటున్నారు. ఈమధ్య ఈవెంట్స్ కి స్టార్స్ ని పిలవడం కన్నా చిత్ర యూనిట్ తోనే కానిచ్చేస్తున్నారు. ఐతే రాబిన్ హుడ్ కోసం తప్పకుండా ఎవరో ఒక స్టార్ ని తీసుకొచ్చే ప్లానింగ్ లో ఉన్నారు మైత్రి మూవీ మేకర్స్. ఆ నిర్మాణ సంస్థ ఇప్పుడు అన్నీ పెద్ద సినిమాలు చేస్తున్నారు. అంతేకాదు భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా రేంజ్ హిట్లు అందుకుంటున్నారు. సో తప్పకుండా ఈ నిర్మాతలు పిలిస్తే కాదనే ఛాన్స్ ఉండదు. ఇంతకీ నితిన్ రాబిన్ హుడ్ కోసం నిర్మాతలు ఎవరిని తీసుకొస్తున్నారు అన్నది తెలియాల్సి ఉంది. నితిన్ భీష్మ తర్వాత వరుస సినిమాలు చేశాడు కానీ అవి మంచి ఫలితాలు ఇవ్వలేదు. ఐతే ఈసారి రాబిన్ హుడ్ తో చాలా స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలని చూస్తున్నాడు నితిన్. ఛలో, భీష్మతో సూపర్ సక్సెస్ లు అందుకున్న వెంకీ కుడుముల ఆడియన్స్ ని ఎంటర్టైన్ చేయడంలో తన టాలెంట్ ప్రూవ్ చేసుకున్నాడు. మరి రాబిన్ హుడ్ తో నితిన్ అనుకున్న సక్సెస్ అందుకుంటాడా లేదా అన్నది చూడాలి. నితిన్ వెంకీ కుడుముల మాత్రం సినిమాపై సూపర్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు.


## బిగ్ ప్రాజెక్ట్ మిస్.. అంతా దేవి శ్రీ ప్రసాద్ మంచికే..




స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్ గత రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో అగ్రస్థానంలో కొనసాగుతున్నా, తను ఎంచుకునే ప్రాజెక్టుల విషయంలో మాత్రం ఎప్పుడూ ఓ ప్రత్యేకమైన ప్లాన్ ఫాలో అవుతుంటాడు. ప్రస్తుతం పోటీదారులు వరుసగా సినిమాలు చేస్తూ రేసులో ఉంటే, దేవి మాత్రం తాను నమ్మిన సినిమాలకే పరిమితం అవుతుంటాడు. గత ఏడాది పుష్ప 2 మ్యూజిక్‌తో దేశవ్యాప్తంగా సెన్సేషన్ క్రియేట్ చేసిన అతను, ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చిన తండేల్‌తో మరో హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. కానీ ఇటీవల గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమా నుంచి దేవి తప్పుకోవడం, ఆ ప్రాజెక్టును జీవి ప్రకాష్ కుమార్ స్వీకరించడం చర్చనీయాంశమైంది. అజిత్, మైత్రి మూవీ మేకర్స్ కాంబినేషన్‌లో రూపొందిన గుడ్ బ్యాడ్ అగ్లీ పై తమిళనాట మాత్రం ఓ మోస్తరు అంచనాలే ఉన్నాయి. వింటేజ్ అజిత్‌ను తెరపై చూపించేందుకు దర్శకుడు అధిక్ రవిచందర్ ఎంతో కష్టపడ్డాడని టాక్. కానీ సినిమా ప్రమోషన్లు, విడుదలైన వీడియో సాంగ్స్ చూస్తుంటే, ఆడియెన్స్‌లో పెద్దగా ఆసక్తి రేకెత్తించలేకపోయాయి. పైగా ఇది రెగ్యులర్ సినిమా అనే కామెంట్స్ వస్తున్నాయి. మాస్ ఎలిమెంట్స్‌తో ఫుల్ ప్యాక్ అవ్వాల్సిన ఈ ప్రాజెక్టుకు మంచి మ్యూజిక్ బ్యాక్‌బోన్‌గా ఉండాల్సి ఉంది. అయితే ప్రస్తుతం వచ్చిన లిరికల్ సాంగ్స్ చూసిన అభిమానులు సంగీతం పరంగా పెద్దగా ఎఫెక్ట్ లేదు అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడే దేవిశ్రీ ప్రసాద్ పేరు మళ్లీ తెరపైకి వచ్చింది. దేవి గతంలో కోలీవుడ్‌లోనూ పలు బ్లాక్ బస్టర్ ఆల్బమ్స్ అందించాడు. అజిత్ సినిమాలకు కూడా బీభత్సమైన మ్యూజిక్ ఇచ్చి అక్కడ కూడా తనకంటూ ఓ క్రేజ్ తెచ్చుకున్నాడు. ఈ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న దేవి గుడ్ బ్యాడ్ అగ్లీకి సెట్ అయ్యి ఉంటే మళ్లీ తమిళంలో బిగ్ స్కేల్ ఆల్బమ్ ఇచ్చే అవకాశం ఉండేదని సినీ విశ్లేషకులు అంటున్నారు. కానీ పుష్ప 2 బిజీ షెడ్యూల్ కారణంగా దేవి ఈ ప్రాజెక్టును వదిలేయడం జరిగిందని, పలు మనస్పర్థల వల్ల నిర్మాతలే తీసేశారని కామెంట్స్ వచ్చాయి. ఇది కొంతమందికి నిరాశ కలిగించినా, దేవి కెరీర్‌కు మాత్రం మంచిదే అని అంటున్నారు. జీవి ప్రకాష్ కుమార్ కూడా గత కొన్నేళ్లుగా మంచి మ్యూజిక్ ఇస్తున్నాడనే విషయాన్ని కొట్టిపారేయలేం. అయితే సినిమాకి పక్కా మాస్ కంటెంట్ లేకపోతే, సంగీత దర్శకుడు ఎంత మంచి సంగీతం ఇచ్చినా వర్కౌట్ అయ్యే ఛాన్స్ తక్కువే. గుడ్ బ్యాడ్ అగ్లీకి జీవి ఇచ్చిన మ్యూజిక్ కూడా మిక్స్డ్ రెస్పాన్స్ అందుకుంటోంది. రెగ్యులర్ గా కాకుండా డిఫరెంట్ సినిమాలు చేయాలని కొత్త దారిలో వెళుతున్న దేవి ఈ ప్రాజెక్టును వదిలేయడం వల్ల, అతనికి ఏ నష్టం జరగలేదని విశ్లేషకులు అంటున్నారు. పైగా, ప్రస్తుతం దేవి ఫోకస్ మొత్తం కంటెంట్ బేస్డ్ సినిమాల మ్యూజిక్‌పైనే ఉంది. అందులో కమ్ముల కుబేర ఒకటి. ఇటీవల వచ్చిన తండేల్ అతనికి మంచి బూస్ట్ ఇచ్చింది. మొత్తానికి చూస్తే, గుడ్ బ్యాడ్ అగ్లీ ఆల్బమ్ ఆడియెన్స్‌ను ఎంతవరకు ఆకట్టుకుంటుందనేది ఇంకా తేలాల్సి ఉంది. కానీ దేవి లాంటి మ్యూజిక్ డైరెక్టర్‌కి ఈ సినిమా చేయకపోవడం వల్ల ఎలాంటి మైనస్ లేదని, పైగా అతని ప్రస్తుత కెరీర్‌కు ఇది మంచి డెసిషన్‌గానే కనిపిస్తోందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఏప్రిల్ 10న సినిమా విడుదల అయిన తర్వాత జీవి మ్యూజిక్ ఏ రేంజ్‌లో సక్సెస్ అవుతుందో చూడాలి.

## శ్రీదేవిలా నటించాలనుంది!

అతిలోక సుందరి శ్రీదేవికి ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఎంతో మంది సెలబ్రిటీలు సైతం ఆమెను అభిమానిస్తుంటారు. రీసెంట్ గా ఓ ఫ్యాషన్ టూర్ లో పాల్గొన్న తమన్నా భాటియాకు ఓ ప్రశ్న ఎదురైంది. ఆన్ స్క్రీన్ పై ఎలాంటి తరహా పాత్రలు పోషించాలనుంది అని అడిగినప్పుడు తమన్నా క్షణం ఆలోచించకుండా వెంటనే శ్రీదేవి పేరు చెప్పింది. శ్రీదేవి 2018లో దురదృష్టవశాత్తూ బాత్ టబ్ లో పడి నీటిలో మునిగి చనిపోయిన విషయం తెలిసిందే. శ్రీదేవిపై తమన్నా తన అభిమానాన్ని ఈ ఈవెంట్ లో వెల్లడించింది. శ్రీదేవి సూపర్ ఐకానిక్ అని, ఆన్ స్క్రీన్ శ్రీదేవిగా నటించాలని కోరుకుంటున్నట్టు తమన్నా తెలిపింది. శ్రీదేవి మేడమ్ ను ఆరాధించే వ్యక్తుల్లో తాను కూడా ఒకరని తమన్నా ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది. స్టీరియోటైప్ పాత్రల నుంచి కామెడీ, డ్రామా వరకు ఎన్నో జానర్లలో పలు విభిన్న పాత్రలను పోషించి ఇండియన్ సినీ హిస్టరీలోనే మొదటి మహిళా సూపర్ స్టార్ గా శ్రీదేవి గుర్తింపు



పొందారని తమన్నా చెప్పింది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో శ్రీదేవి 50 సంవత్సరాలకు పైగా వివిధ రంగాల్లో కొనసాగారని, మిస్టర్ ఇండియా, సద్మా, హిమ్మత్ వాలా, ఖుదా గవా, లాడ్లా, ఇంగ్లీష్ వింగ్లీష్, మామ్ లాంటి గుర్తుండిపోయే సినిమాల్లో శ్రీదేవి నటించారని తమన్నా తెలిపింది. ఇక తమన్నా విషయానికొస్తే అమ్మడు ఆఖరిగా నీరజ్ పాండే దర్శకత్వంలో వచ్చిన సికిందర్ కా ముఖద్దర్ సినిమాలో నటించింది. ఈ సినిమాలో జిమ్మీ షేర్ గిల్, అవినాష్ తివారీ, రాజీవ్ మెహతా మరియు దివ్య దత్తా కీలక పాత్రల్లో నటించారు. ప్రస్తుతం తమన్నా తెలుగులో చేస్తున్న ఓదెల2 త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అశోక్ తేజ దర్శకత్వంలో వస్తున్న ఓదెల2ను సంపత్ నంది కథ అందిస్తూ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో తమన్నా నాగ సాధువుగా కనిపించనుంది. ఓదెల2 పై తమన్నా చాలానే ఆశలు పెట్టుకుంది. దానికి తగ్గట్టే రీసెంట్ గా రిలీజైన ఓదెల2 టీజర్ కూడా సినిమాపై అంచనాల్ని పెంచింది.

## శ్రీలీల టర్నింగ్ పాయింట్.. క్లిక్కయితే కోట్ల వర్షమే..

టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన కొద్దికాలంలోనే స్టార్ హీరోయిన్ గా మారిన శ్రీలీల, ఇప్పుడు తన కెరీర్ ను మరో లెవెల్ కు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతోంది. తన అందం, ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్, గ్రేస్‌ఫుల్ డాన్స్ మూమెంట్స్‌తో సినీ ప్రేమికుల మనసు దోచిన ఈ బ్యూటీ, ఇప్పుడు నేషనల్ లెవల్ లో తన మార్క్ వేసేందుకు రెడీ అవుతోంది. ఇప్పటికే తెలుగు పరిశ్రమలో స్టార్ హీరోల సరసన వరుస సినిమాలు చేస్తూ తన స్థాయిని పెంచుకుంటున్న శ్రీలీల, 2025లో మరిన్ని క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా మారనుంది. ఈ బ్యూటీ 2025ను ఫుల్ బిజీగా ప్లాన్ చేసుకుంది. ఇప్పటికే తెలుగులో స్టార్ హీరోలతో వరుస సినిమాలు చేస్తోన్న ఆమె, ఒక సినిమాకు 2 కోట్లకు పైనే డిమాండ్ చేస్తున్నట్లు టాక్. ఇప్పుడు బాలీవుడ్, కోలీవుడ్‌లలోనూ తన టాలెంట్‌ను ప్రూవ్ చేసుకునేందుకు సిద్ధమవుతోంది. అక్కడ కూడా



అమ్మడు అదే రేంజ్ లో అందుకుంటున్నట్టు టాక్. తాజా సమాచారం ప్రకారం, శ్రీలీల బాలీవుడ్ లో కార్తిక్ ఆర్యన్ సరసన ఓ క్రేజీ ప్రాజెక్ట్‌లో నటించనుందని తెలుస్తోంది. ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నా, శ్రీలీల హిందీ సినిమాల్లో అడుగు పెట్టనుందన్న వార్త మాత్రం హాట్ టాపిక్ గా మారింది. అంతేకాదు, తమిళ పరిశ్రమ లోనూ ఎంట్రీ ఇవ్వడానికి శ్రీలీల రెడీ అయ్యింది. శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కుతున్న SK25 సినిమాలో శ్రీలీల కథానాయికగా నటించనుందట. ఈ ప్రాజెక్ట్ ద్వారా కోలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరవ్వాలని శ్రీలీల భావిస్తోంది. ఇప్పటికే ఆమె డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ కి తమిళనాట కూడా అభిమానులు పెరిగిపోతున్నారు. దీంతో అక్కడ కూడా స్టార్ హీరోయిన్‌గా నిలిచేందుకు శ్రీలీలకు ఇదొక మంచి అవకాశం అవుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంతేకాదు, శ్రీలీల మరో బాలీవుడ్ బిగ్ ప్రాజెక్ట్‌లో ఛాన్స్ దక్కించుకున్నట్లు సమాచారం. టాప్ ప్రొడక్షన్ హౌస్ మాడాక్ ఫిలిమ్స్ బ్యానర్ లో రూపొందనున్న సినిమాలో, సైఫ్ అలీఖాన్ తనయుడు ఇబ్రహీం అలీఖాన్ సరసన నటించే అవకాశముందని టాక్. ఇది నిజమైతే శ్రీలీలకు బాలీవుడ్‌లో మరింత క్రేజ్ రావడం ఖాయం. తెలుగు పరిశ్రమలో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు బాలీవుడ్, కోలీవుడ్‌లలో కూడా తన మార్క్ వేసేందుకు రెడీ అవుతోంది. ఈ విధంగా చూస్తే, శ్రీలీల 2025ను తన కెరీర్ లోనే టర్నింగ్ పాయింట్‌గా మలుచుకునేలా ప్లాన్ చేసుకుంటోంది.




ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోసారి కాల్పులతో దద్దరిల్లుతోంది. ఒకేరోజు బీజాపూర్, కాంకెర్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్ల లో 30 మంది మావోయిస్టులు మృతి చెందారు.

ఈ ఎదురుకాల్పుల్లో ఓ జవాను కూడా అమరుడైనట్లు అధికారులు వెల్లడించారు. బీజాపూర్ – దంతెవాడ జిల్లాల సరిహద్దులో ఉన్న గంగలూరు పరిధి అండ్రి అడవుల్లో నక్సల్స్ నక్కినట్లు నిఘా సమాచారం వచ్చింది. దీంతో జిల్లాల నుంచి సంయుక్త బలగాలు గురువారం ఉదయం నుంచి అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య భారీ ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. ఈ కాల్పుల్లో మావోయిస్టులకు భారీ నష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రాంతంలో 26 మంది మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. ఘటనాస్థలంలో పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. బీజాపూర్ ఎదురుకాల్పుల్లో ఓ జవాను కూడా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. ఇక, ఇదే సమయంలో కాంకెర్ జిల్లాలోనూ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది.

ఇక్కడ డీఆర్‌జీ, బీఎస్‌ఎఫ్ సిబ్బంది సంయుక్తంగా జరిపిన ఆపరేషన్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. రెండు జిల్లాల్లోనూ ప్రస్తుతం యాంటీ–నక్సల్స్ ఆపరేషన్ కొనసాగుతోంది. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# నెల రోజుల్లో గ్రూప్-2, 3 నియామకాలు పూర్తి చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: సీఎం పదవి చేపట్టడం కన్నా.. జడ్పీటీసీగా గెలిచినప్పుడే ఎక్కువ ఆనందం కలిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మొదటిసారిగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన 'ప్రజాపాలనలో కొలువుల పండగ' కార్యక్రమంలో ఆయన పాల్గొని 'బిల్డ్ నౌ పోర్టల్'ను ప్రారంభించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖల్లో కారుణ్య నియామకాలకు సంబంధించి 922 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. కారుణ్య నియామకాలు క్రమం తప్పకుండా చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. "కారుణ్య నియామకాలు మీ హక్కు. గత ప్రభుత్వం కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం వల్ల మీరు పదేళ్లు నష్టపోయారు. జాబ్ క్యాలెండర్‌తో పాటుగా కారుణ్య నియామకాలు కూడా ఇవ్వాల్సిందే. తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగుల పాత్ర మరువలేనిది. స్వరాష్ట్రం వచ్చినా నిరుద్యోగుల కల నెరవేరలేదు. పేదలు, బడుగుబలహీన వర్గాలవారే పోటీ పరీక్షలకు సిద్ధమవుతారు. నిరుద్యోగుల బాధలను ప్రజా ప్రభుత్వం గుర్తించింది. అందుకే ఏడాదిలోనే 59వేల ఉద్యోగాలు ఇచ్చాం. నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే భారాస ఓడిపోయింది. మాకు ఉద్యోగాలు



ఇవ్వని మీకు ఉద్యోగాలు ఎందుకని నిరుద్యోగులు భారాసను ఓడించారు. కారుణ్య నియామకాలపై మాట్లాడే హక్కు భారాసకు లేదు. నిరుద్యోగుల బాధలు నాకు తెలుసు. ఉద్యోగ ఖాళీలను పెండింగ్ పెట్టొద్దని ఆదేశాలిచ్చా. పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలోనే ఫలితాలు ఇచ్చాం. 30, 40 రోజుల్లో గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3 ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తాం. ఉద్యోగాలు ఇచ్చినా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయి"అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# రేవంత్ రెడ్డి పాపమే రైతన్నకు శాపంలా మారింది : కేటీఆర్



సూర్యాపేట : ఇవాళ తెలంగాణ వ్యాప్తంగా పంటలు ఎండుతున్నాయి అంటే కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి పాపమే రైతన్నకు శాపంలా మారిందని పేర్కొన్నారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. రైతులకు రావాల్సిన 37 వేల కోట్ల రూపాయలు ఢిల్లీలో రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ ఖర్గే ఖాతాల్లో టింగు టింగు మనీ పడుతున్నాయి. కేసీఆర్ కాంగ్రెస్ సన్నాసులను నమ్మితే రైతుబంధుకి రామ్ రామ్ అయితదని ముందే చెప్పిండు. అదే ఇవాళ జరిగింది. నీళ్ల మంత్రి నల్లగొండలోనే ఉన్నా చుక్కనీరు తేలేకపోతున్నారు. ఎస్ఎల్బీసీ ప్రమాదం జరిగితే ఒక మంత్రి పోయి చాపల కూర చేపించుకొని తిన్నాడు అని కేటీఆర్ విమర్శించారు. అధికారం మాత్రమే పోయింది ప్రజల్లో అభిమానం మాత్రం అలాగే ఉంది. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుంది గాడిదని చూస్తేనే గుర్రం విలువ తెలుస్తుంది. అట్లనే కాంగ్రెస్ కంచర గాడిదలను చూసిన తర్వాతనే ప్రజలకు కేసీఆర్ గొప్పతనం తెలిసి వచ్చింది. కేసీఆర్ ఉన్నప్పుడు వచ్చిన నీళ్లు కాంగ్రెస్ ఉన్నప్పుడు ఎందుకు రావడం లేదని అడిగితే ఏ ఒక్క కాంగ్రెస్ నేత సమాధానం చెప్పడం లేదు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం నుంచి నీళ్ళు రాకపోతే మరిప్పుడు కాంగ్రెస్ కట్టిన ఎస్సారెస్పీ నుంచి నీళ్లు ఎందుకు రావడం లేదు. కేసీఆర్ మీద ఉన్న గుడ్డి ద్వేషంతో మేడిగడ్డ చిన్న పర్రెను రిపేరు చేయించకుండా గోదావరి నీళ్లను ఆంధ్రకు వదిలేస్తున్నారు. కృష్ణానదిలో 36 శాతం నీళ్లను కేసీఆర్ ప్రభుత్వం వాడుకుంది. కానీ ఈ కాంగ్రెస్ సన్నాసుల ప్రభుత్వం 24 శాతం నీళ్లను కూడా వాడుకోలేదు. నీళ్లు వాడుకునే తెలివి లేదు. నీటిని పొదుపు చేసుకునే తెలివి లేదు. చెరువులనునింపే తెలివి లేదు. భూగర్భ జలాలను పెంచే తెలివి లేదు అని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ వైఫల్యాలను బిజెపి ప్రశ్నించదు. బడే భాయ్ మోడీ చోటే బాయ్ రేవంత్ మధ్య ఆ అండర్‌స్టాండింగ్ ఉంది. తెలంగాణకు గొంతుగా బిఆర్ఎస్ ఉండొద్దని కాంగ్రెస్ బీజేపీల ఉమ్మడి లక్ష్యం. కేసీఆర్ తెలంగాణ పక్షం కాంగ్రెస్ బిజెపి ఢిల్లీ పక్షం. రేవంత్ రెడ్డి అవినీతిని ఆధారాలతో సహా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన ఇప్పటివరకు ఎలాంటి చర్య తీసుకోవడం లేదు. ఒక్కొక్క గ్రామం నుంచి బండ్లు కట్టుకుని వరంగల్ సభకు సూర్యాపేట, ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ప్రజలు తరలి రావాలి. కాంగ్రెస్, బిజెపి గుండెల్లో రైళు పరిగెత్తించాల్సిన సందర్భం ఏప్రిల్ 27.. రొక్కసారి గులాబీ సైన్యం కదం తొక్కాలి అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# రాజకీయ కోణంలో 'మిస్ వరల్డ్' పోటీలను చూడొద్దు: మంత్రి జూపల్లి



హైదరాబాద్: సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ నెలవని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. 72వ మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఇది చరిత్రాత్మక కార్యక్రమం. కొత్త రాష్ట్రంలో కొత్త కార్యక్రమం జరుగుతోంది. మహిళల ఆత్మ సౌందర్యాన్ని సెలబ్రేట్ చేయడం మిస్ వరల్డ్ పోటీల ఉద్దేశం. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పది. రాష్ట్రంలో అన్ని రంగాల వారికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రపంచానికి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారం, పర్యటక అందాలను తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయి. దక్షిణ కొరియాలో స్క్విడ్ గేమ్, బీటీఎస్ బ్యాండ్ లాంటివి ఆ దేశానికి ఎంతో ఉపయోగపడ్డాయి. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణకు పేరు ప్రఖ్యాతులతో పాటు ఆర్థికంగానూ వృద్ధి సాధిస్తుందని భావిస్తున్నాం. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, ప్రపంచస్థాయి పెట్టుబడులు ఆకర్షించేందుకు ఇది మంచి అవకాశం. రాష్ట్ర ఆదాయం కూడా పెరుగుతుంది. అందాల పోటీలను మహిళా సాధికారతకు ప్రతీకగా చూడాలి. ప్రభుత్వంపై విమర్శలకు, రాజకీయ కోణంలోనే మిస్ వరల్డ్ పోటీలను చూడటం సరికాదు. 140 దేశాల నుంచి పోటీదారులు వస్తారు. వారితో పాటు దేశవిదేశాలకు చెంది

# బెట్టింగ్ యాప్స్ వ్యవహారం.. రానా, విజయ్ దేవరకొండ సహా పలువురు సినీ ప్రముఖులపై కేసు

హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ యాప్‌లను ప్రమోట్ చేసిన వారిలో ఉన్న ప్రముఖ నటీనటులపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నటీనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు సహా మొత్తం 25 మంది ఈ జాబితాలో ఉన్నారు. సినీ ప్రముఖుల జాబితాలో రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్ ఉన్నారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లలో అనన్య నాగళ్ల, సిరి హనుమంతు, శ్రీముఖి, వర్షిణి సౌందరరాజన్, వాసంతి కృష్ణన్, శోభా శెట్టి, అమృత చౌదరి, నయని పావని, నేహా పఠాన్, పండు, పద్మావతి, ఇమ్రాన్‌ఖాన్, విష్ణు ప్రియ, హర్ష సాయి, బయ్యా సన్నీ యాదవ్, యాంకర్ శ్యామల, టేస్టీ తేజ, రీతూ చౌదరి, బండారు సుప్రీత ఉన్నారు. మియాపూర్ వాసి ప్రమోద్ శర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.







హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసి చిక్కుల్లో పడిన యాంకర్ విష్ణుప్రియ పోలీసుల విచారణలో కీలక విషయాలను వెల్లడించింది. పంజాగుట్ట పీఎస్?లో విచారణకు హాజరైన విష్ణుప్రియ స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డ్ చేశారు. 15 బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్ చేసినట్లు విష్ణుప్రియ పోలీసులకు వెల్లడించింది. ఒక్కో వీడియోకు రూ.90 వేలు వచ్చినట్టు పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్?లో విష్ణుప్రియ తెలిపింది. ఈ లెక్కన 15 బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన విష్ణుప్రియ లక్షల్లో సంపాదించింది. ఈ కేసులో విష్ణుప్రియ విచారణ పూర్తయింది. విష్ణు ప్రియ మొబైల్‌ను పంజాగుట్ట పోలీసులు సీజ్ చేశారు. మూడు గంటల పాటు విష్ణుప్రియను పోలీసులు విచారించారు. యూట్యూబర్స్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ యువతను ఉద్ధరించకపోయినా పర్లేదు గానీ ఇలా యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్న బెట్టింగ్ యాప్స్?ను ప్రమోట్ చేసి డబ్బులు దండుకోవడంపై నెటిజన్లు మండిపడ్డారు. బెట్టింగ్ యాప్స్ కు ప్రమోషన్ చేసి లక్షల్లో కోట్లల్లో దండుకున్నారు సెలబ్రిటీలు. ఎంత చెట్టుకు అంతగాలి అన్నట్లు.. స్టార్ డమ్ ను బట్టి లక్షల నుంచి కోట్లల్లో సాగింది ఈ వ్యవహారం. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ విష్ణుప్రియనే నిమిషానికి.. ఒక్కో వీడియోకు 90 వేల రూపాయలు వసూలు చేసిందంటే.. ఇక హీరోలు, హీరోయిన్స్ ఎంతెంత వసూలు చేసి ఉంటారు.. బెట్టింగ్ యాప్స్ నుంచి ఎంతెంత తీసుకుని ఉంటారు అనేది ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చనీయాంశం అయ్యింది. విజయ్ దేవరకొండ, రాణా, ప్రకాష్ రాజ్, నిధి అగర్వాల్, మంచు లక్ష్మి లాంటి సార్లు.. పాపులర్ ఫిగర్స్ కోట్లలో రెమ్యునరేషన్ వసూలు చేసి ఉండొచ్చు అన్న ప్రచారం జోరుగా సాగుతుంది.

**బెట్టింగ్ మాఫియాలో 25 మంది హీరో, హీరోయిన్స్...** తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్స్‌పై నిషేధం ఉందన్న సంగతి తెలిసిందే. చట్టం చేసిన విషయం తెలిసిందే. ఇలాంటి బెట్టింగ్స్ యాప్స్ వల్ల ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే వెయ్యి మంది ఆత్మహత్య చేసుకుంటే.. వేల కుటుంబాలు సర్వనాశనం అయ్యాయి. అలాంటి బెట్టింగ్స్ యాప్స్?కు ప్రచారం చేసిన సినీ హీరో, హీరోయిన్స్, నటులు మాత్రం కోట్లకు కోట్లు సంపాదించుకున్నారు.. ఇదేనా న్యాయం.. ఇదేనా ధర్మం.. ఇదేనా సామాజిక బాధ్యత అంటూ ఇప్పుడు వాళ్ల తీరును దుమ్మెత్తిపోస్తున్నారు జనం. తీగ లాగితే డొంక కదిలినట్లుగా ఈ వ్యవహారంలో పాలుపంచుకున్న క్యారెక్టర్ ఆర్టిస్టుల నుంచి పెద్ద పెద్ద నటులు, హీరోల వరకు కేసులు చేస్తున్నారు పోలీసులు. చూడాలి మరి ఇంకెంత మంది సెలబ్రిటీలో బయటికొస్తారో.

# ఏపీ, తెలంగాణలో ఎండలకు బ్రేక్.. వర్షాలకు వెల్‌కమ్-ఎక్కువగా ఈ జిల్లాల్లోనే!

వేసవి కాలం వచ్చేసింది. ఎండలు భగభగ మండిపోతున్నాయి. ఇంట్లో నుంచి బయటకు రావాలంటే ప్రజలు గజగజ వణికిపోతున్నారు. అర్జెంట్ పని ఉన్నా.. అమ్మో ఎండ అంటూ వెనక్కి తగ్గుతున్నారు. ఇంట్లో ఉండి ఉక్కపోతకు గురై చెమటలు కక్కుతున్నారు. వేసవి వచ్చిందంటే ప్రజల పరిస్థితి 'ముందుకెళ్తె నుయ్యి.. వెనక్కి వెళ్తే గొయ్యి' అన్నట్లు ఉంటుంది. బయటకు వెళ్తే ఎండలు.. పోనీ ఇంట్లో ఉందామా అంటే ఉక్కపోత.. ఇలా ప్రజలు మగ్గిపోతున్నారు. మరి అలాంటి సమయంలో చల్ల చల్లని గాలితో ఫ్రిడ్జ్‌లోంచి అప్పుడే తీసిన కూలింగ్ వాటర్లా వర్షం పడితే ఎలా ఉంటుంది. దాన్ని ఊహించుకుంటేనే ఏదో తెలియని ఫీలింగ్ కలుగుతుంది కదూ. అయితే ఆ ఫీలింగ్ ఎంజాయ్ చేసే సమయం వచ్చేసింది.




**తెలంగాణలో వర్ష సూచన...** వేసవి కాలంలో వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు పడనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల అంటే మార్చి 21, 22 తేదీల్లో పలు జిల్లాల్లో వర్షాలు పడనున్నట్లు సమాచారం. అందులో ఎక్కువగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో వర్షాలు పడతాయని వాతావరణ శాఖ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయంపై IMDలోని వాతావరణ శాస్త్రవేత్త KS శ్రీధర్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "మార్చి 20 నుండి మేఘాలు ఏర్పడతాయి. దీనివల్ల తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయి" అని ఆయన తెలిపారు. మరోవైపు పలు ప్రాంతాల్లో వర్షాలు పడే ముందు ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల సహా అనేక జిల్లాలు 40–41 డిగ్రీల సెల్సియస్ మధ్య తీవ్ర ఉష్ణోగ్రతలను ఎదుర్కొంటాయని సమాచారం.

**ఏపీలో వర్ష సూచన...** అలాగే ఆంధ్రప్రదేశ్లోనూ వర్షాలు పడే అవకాశం ఉందని వారు తెలిపారు. మార్చి 22, 23 తేదీల్లో ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ వంటి ప్రాంతాల్లో అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు అంచనావేస్తున్నారు. దీంతో వర్షపాతం సమీపిస్తున్న కొద్దీ వేడిగాలులు బలహీనపడతాయి. అందువల్ల ఉరుములు, ఈదురుగాలులు వీస్తున్నందున.. భారీ వర్షం సమయంలో ఇంటి లోపల ఉండటం, బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని IMD ప్రజలకు సూచించింది. ఈ వర్షాలు పడేవరకు అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని చెబుతున్నారు. అయితే మార్చి 25 తర్వాత వేడిగాలుల పరిస్థితులు తిరిగి దంచికొట్టే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

# హరీష్‌రావుకు భారీ ఊరట.. కేసు కొట్టివేత




హైదరాబాద్, మార్చి 20: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ డీసీపీ రాధాకిషన్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఫోన్‌టాపింగ్ కేసులో ఎఫ్ఐఆర్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫోన్ టాపింగ్ కేసు నమోదు అయ్యింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు పోలీసులు. మాజీ మంత్రి హరీష్‌రావు, మాజీ డీసీప రాధాకిషన్ రావులను నిందితులుగా చేర్చారు. ఈ కేసులో ఇప్పటికే వాదనలు ముగియగా.. ఈరోజు హైకోర్టు తీర్పు వెలువరించింది. ఫోన్ ట్యాపింగ్ కేసును కొట్టివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు అయిన విషయం తెలిసిందే. పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన రెండో ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలంటూ తెలంగాణ హైకోర్టులో హరీష్ రావు, రాధాకిషన్‌రావు వేసిన పిటిషన్‌పై సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. ఈ క్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదుపై పంజాగుట్ట పోలీసులు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేస్తూ న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఎఫ్ఐఆర్‌లో హరీష్ రావుతో పాటు రాధాకిషన్‌రావును నిందితులుగా చేర్చారు. ఇప్పటికే ఇరు వాదనలు పూర్తవడంతో తీర్పును వెలువరించింది న్యాయస్థానం. ఇద్దరిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తెలంగాణ హైకోర్టు కీలక తీర్పును వెల్లడించింది.

అధికారంలో ఉన్న సమయంలో తన ఫోన్‌ను ట్యాప్ చేసి.. తనను ఇబ్బందులకు గురిచేశారని.. వారి వల్ల తనకు ప్రాణహానీ ఉందంటూ రియల్ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ కొంతకాలం క్రితం మీడియాతో మాట్లాడారు. చక్రధర్ ఇచ్చిన సమాచారం, ఆయన ఇచ్చిన ఎవిడెన్స్‌ను ఆధారంగా చేసుకుని పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.

కానీ అందులో సరైన ఆధారాలు లేవని హరీష్ రావు తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. హరీష్‌రావు, రాధాకిషన్ వాదనలతో ఏకభవించిన హైకోర్టు.. పంజాగుట్టలో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది.

# రైతు బంధు లేదు, రైతు బీమా లేదు..

జనగామ జల్లా: రాష్ట్రంలో కాలం తెచ్చిన కరువు కాదని.. కాంగ్రెస్ తెచ్చిన కరువు అని.. రైతు బంధు లేదు, రైతు బీమా లేదు.. రైతులకు 24 గంటల కరెంట్ లేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. గురువారం దేవరుప్పుల మండల కేంద్రంలోని చౌరస్తాలో బీఆర్ఎస్ రైతు నిరసన దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ఎండిన పంట పొలాలకు ఎకరానికి ఇరవై ఐదు వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇది ప్రజా పాలన కాదని... అంతా దొంగల పాలన అయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అరిగోస పెడుతోందని.. ధర్నా వద్దు మూడు రోజులలో నీళ్లు ఇస్తామని అధికారులు ఫోన్ చేశారని అన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు పంట నష్టపరిహారం కింద పది వేలు ఇచ్చిన మహాత్ముడు కేసీఆర్ అని అన్నారు. పంటలు ఎండిపోయిన తరవాత నీళ్లు ఇచ్చి ఎం లాభమని అన్నారు. రైతు కండ్లలో నీళ్ళు తప్ప ఆనందం లేదని, రైతులకు వెంటనే ఇరవై ఐదు వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ఎర్రబెల్లి దయాకర్ రావు మరొక్కసారి డిమాండ్ చేశారు. కాగా పార్టీ మారాలని ఎవరు ఒత్తిడి చేసినా మారేది లేదని ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు. తాను పోలీసులతో బెదిరించి ఇల్లు రాయించుకున్నానని శరణ్ చౌదరి అనే వ్యక్తి చేసిన ఆరోపణలకు వివరణ ఇచ్చారు. తన 40 ఏండ్ల రాజకీయ జీవితంలో నిజాయితీగా ఉన్నాయని అన్నారు.తనపై కేసులు పెట్టాలని అనేక మంది ప్రయత్నాలు చేశారని తెలిపారు. శరణ్ చౌదరి అనే వ్యక్తి తనపై ఆరోపణలు చేసినట్లు మీడియాలో చూశానని, తన విచారణలో అతడు బీజేపీలో ఉన్నట్లు తెలిసిందన్నారు. భూముల దందాలు, మోసాలు చేస్తున్నాడని అతడిని బీజేపీ తొలగించిందని చెప్పారు. ఎన్నారైలను కూడా కోట్ల రూపాయాలు మోసం చేసినట్లు తెలిసిందని అన్నారు. అతనితో తనకు ఎలాంటి సంబంధం లేదని ఎర్రబెల్లి స్పష్టం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com